






నరుడు.. వానరుడు!

అడవుల్లో ఉండాల్సిన వానరమూక జనారణ్యంలోకి ఎందుకొస్తుంది..? ఇది సమాధానంలేని ప్రశ్న.. ఒకనాడు వానరమూకను చూడాలంటే అటవీ ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది.. మరిప్పుడో జనారణ్యాన్నే అడవులుగా మార్చుకుంటున్నాయి.. ఇష్టానుసారం ప్రవర్తిస్తున్నాయి.. కోతి చేష్టలతో జనాలను ఇబ్బంది పెడుతున్నాయి..పై చిత్రంలోనే వానరమూకను చూడండి.. ఒక గోడ ఎక్కడానికి ఎంత హడావుడి చేస్తున్నాయో. అటు పంటలను నాశనం చేస్తున్నాయి.. ఇటు ఇళ్లపై దాడులు చేస్తున్నాయి.. తట్టుకోలేని జనం బాబోయ్ వా..నరకం భరించలేకపోతున్నాం.. అడవులకు తరలించాలని వేడుకుంటున్నారు.. వానరాలు అడవులను వదిలి జనారణ్యంలోకి ఎందుకొస్తున్నాయనే దానిపై అటవీ అధికారులు దృష్టిపెట్టాలి మరి.. - వివరాలు 6లో

కుడితే అంతేనండోయ్!



ఈ చిత్రంలో పురుగు చూస్తే దోమలా ఉంది కదూ.. ఆ జాతికి చెందినదే అయి ఉండొచ్చు కానీ.. దోమ మాత్రం కాదు.. ఇటీవల స్క్రబ్ టైఫస్ కేసులు అధికంగా నమోదవుతున్నాయి.. కాకినాడ జిల్లాలో ఈ తరహా కేసులు అధికంగా ఉన్నాయి.. తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో మాత్రం ఇంత వరకూ నమోదు కాలేదు.. స్క్రబ్ టైఫస్ ఎలా వస్తుందంటే ఒక నల్లి లాంటి పురుగు కుట్టడం ద్వారా సంక్రమిస్తుందని చెబుతున్నారు.. అది ఎలా ఉంటుందనేది ఇప్పటి వరకూ ఎవరికీ తెలియదు.. అయితే జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల్లో మాత్రం ఇప్పటికే చర్యలు చేపట్టారు. అనుమానితులకు ర్యాపిడ్ టెస్టులు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు.. ఈ మేరకు జిల్లా కేంద్రాల్లోని ఆసుపత్రుల్లో ప్రత్యేకంగా ర్యాపిడ్ కిట్‌లు సిద్ధం చేశారు. వైద్యాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. - వివరాలు 7లో

అభలే!

మహిళా రాపిడోలు..రయ్‌రయ్



ఆమె లేని రంగమేదైనా ఉందా... అందుగలదు.. ఇందులేదని సందేహం వలదు..ఎందెందు వెదికినా ఆమె గలదు.. ఎందుకంటే.. ఏ రంగమైనా మేం సైతం అంటున్నారు.. కూటమి సర్కారు కూడా స్త్రీశక్తికి జైకొడుతోంది.. మహిళల ఆర్థిక స్వావలంభనకు తన వంతు అండగా నిలుస్తోంది.. ఎదుగుదలను ప్రోత్సహిస్తోంది.. గతంలో కాకినాడ, రాజమహేంద్రవరంలో 50 మంది మహిళలకు సబ్సిడీపై రాపిడో ఈ బైక్‌లను ప్రోత్సహించింది.. ఆదరణ బాగుండడంతో ఏకంగా 255 బైక్‌లను రంగంలోకి దించేందుకు సమాయత్తమవుతోంది.. మహిళలు భలేభలే అంటూ ఉత్సాహం చూపుతున్నారు.

- ఉమ్మడి జిల్లాలో మహిళలకు ఛాన్స్
- త్వరలో మెప్మా ఆధ్వర్యంలో ఎంపిక
- కాకినాడ జిల్లాలో 230
- రాజమహేంద్రవరంలో 25 మంది
- సబ్సిడీపై ఈబైక్‌లు అందజేత
- గతంలో మహిళా రైడర్లకు ఆదరణ



మహిళలకు ఈ బైక్‌లు ఇస్తున్న కాకినాడ జిల్లా ఇన్‌చార్జి మంత్రి నారాయణ(ఫైల్)

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

మహిళలు ఆర్థిక స్వావలంభన సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మెప్మా ద్వారా రాపిడో ఈ బైక్‌లు ఇచ్చి ప్రోత్సహిస్తోంది.ప్రస్తుతం కాకినాడ, రాజమహేంద్రవరం నగరాల్లో ప్రయో గాత్మకంగా ప్రవేశపెట్టిన మహిళా రాపిడో ఈ వాహనాలకు ఆదరణ బాగుండడంతో కొత్తగా మరింత మందికి అవకాశం ఇవ్వాలని నిర్ణయించింది. కాకినాడ జిల్లాలో 230 మంది, రాజమహేంద్రవరంలో మరో 25 మందిని ఎంపిక చేయడానికి కసరత్తు ప్రారంభించింది.మరోపక్క డ్వాక్రా గ్రూపుల్లో మహిళలు రాపిడో ద్వారా బైక్‌లు నడపడానికి ముందుకు వస్తే ఆ సంస్థకు తొలి మూడు నెలలు ఫ్లాట్‌ఫాం ఛార్జీలు చెల్లించక్కర్లేకుండా ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది.ఆ తర్వాత నుంచి నెలకు వెయ్యి చెల్లించాల్సి ఉండగా ఒక్కో వాహనానికి నెలకు 300 బుకింగ్‌లు రాపిడో ఇవ్వనుంది.

రాబడి రయ్..రయ్...

మహిళలు ఆర్థికంగా ఎదిగేలా చేసేందుకు రాష్ట్రప్రభుత్వం రాపిడో సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. జిల్లాల్లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ద్వారా స్వయం సహాయక బృందాల్లోని సభ్యులను ఎంపిక చేసి వారికి ఎలక్ట్రికల్ బైక్‌లు అందిస్తోంది. దీంతో వీరు నిత్యం రాపిడో ద్వారా ప్రయాణీకులను వారి గమ్య స్థానాలకు బైక్‌లపై చేర్చి నెలనెలా కొంత ఆదాయం సంపాదించుకునేలా చేయాలని లక్ష్యం పెట్టుకుంది.మహిళలు సురక్షితంగా తమ ప్రాంతాలకు వెళ్లడానికి రాపిడో ద్వారా మహిళలే వస్తే వారికి స్వయం ఉపాధి లభించినట్లవు తుందని ప్రభుత్వం భావించింది. అందులో భాగంగా ఈ ఏడాది జూన్ నుంచి పథకాన్ని పట్టాలెక్కించింది. పైలట్ ప్రాజెక్టు కింద తొలుత కాకినాడ, రాజమహేంద్రవరం నగరాల్లో చెరో 25 మంది మహిళలను ఎంపిక చేసింది. వీరంతా స్థానికంగా ఉన్న డ్వాక్రా గ్రూపు మహిళలే. వీరికి బ్యాంకు ద్వారా ఎలక్ట్రిక్ బైక్‌కు రుణం ఇప్పించింది. అటు ప్రభుత్వం తరఫున రూ.15 వేల వరకు సబ్సిడీ అందించింది. ఇప్పుడు ఈ మహిళంతా రాపిడో ద్వారా ఈ బైక్‌లతో ఎంచక్కా తిరుగుతున్నారు.ఒక్కో రాపిడో మహిళా బైక్ రైడర్‌కు నెలకు రూ.18 వేల నుంచి రూ.22 వేల వరకు ఆదాయం లభిస్తోంది.రైడ్‌లకు వెళితే రోజుకు రూ.800 నుంచి రూ.వెయ్యి వరకు ఆదాయం సంపాదిస్తున్నారు.

కాకినాడలో..

కాకినాడ నగరంలో మెప్మా ద్వారా ఎంపిక చేసిన మహిళలకు రాపిడో ద్వారా ఆదాయం బాగుండ డంతో మరింత మంది మహిళలను ఎంపిక చేయడానికి అధికారులు సన్నా హాలు చేస్తున్నారు. త్వరలో మరో 75 మందిని రాపిడోతో అనుసంధానించబోతున్నారు. కాకినాడలో ఆదరణ బాగుండడంతో మొత్తం వంద మందిని ఎంపిక చేయాలని మెప్మా లక్ష్యం విధించుకుంది.పిఠాపురం మునిసిపాలిటీ పరిధిలో 25, సామర్లకోట 30, పెద్దాపు రం 25, గొల్లప్రోలు 25, తుని 25, ఏలేశ్వరంలో 25 మంది చొప్పున మొత్తం జిల్లాలో కాకినాడ కార్పొరేషన్, మిగిలిన మునిసిపాలిటీలు, నగర పంచాయతీలు కలిపి త్వరలో 255 మందిని ఎంపిక చేయనున్నారు. తద్వారా ఎలక్ట్రిక్ బైక్‌లు కొనుగోలుకు రూ.5.28 కోట్ల వరకు వ్యయం అవుతుందని అంచనా వేశారు. డ్వాక్రా గ్రూపు సభ్యుల్లో ఒకరు లేదా వారి కుటుంబ సభ్యుల్లో ఆసక్తి కలిగిన వారిని అధికారులు ఎంపిక చేస్తున్నారు.

రాజమహేంద్రవరంలో 25

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరంలో ఇప్పటికే 25మంది రైడర్లు ఉండగా, మరో 25 మందిని ఎంపిక చేయ డానికి కసరత్తు మొదలుపెట్టారు. తొలుత ప్రయోగాత్మకంగా ఎంపిక చేసిన 25 మందిలో కొందరి ఈ బైక్‌లు విజయవాడ నుంచి రప్పించడంతో తరచూ మరమ్మతుకు గురవుతున్నట్టు అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో కొత్తగా ఎంపిక చేయనున్న మహిళా రైడర్లకు ఇకపై రాజమహేంద్రవరంలోనే ఎలక్ట్రిక్ బైక్‌లు అందించేలా ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకున్నారు.

మరికొన్ని మునిసిపాలిటీలు

కొవ్వూరు, నిడదవోలు మున్సిపాల్టీలు, కోన సీమ జిల్లాలో అమలాపురం, మండపేట, రామ చంద్ర పురం మునిసిపాలిటీల్లోనూ ఈ సర్వీ సులు కొనసాగేలా అధికారులు ప్రయత్నం చేశారు. మెప్మా అధికారులు స్థానిక ప్రజా ప్రతి నిధులతో నుమాట్లాడారు. ప్రస్తుతం కొన్ని మునిసిపాలిటీల పరిధిలో డిమాండ్ లేదని, ఉన్న రూట్లలో త్వరలో బైక్‌లు లేదా ఎలక్ట్రికల్ ఆటోలు నడిపేలా మహిళలను ఎంపిక చేయాలని భావిస్తున్నారు.



ఉత్తమ హోంగార్డులతో ఎస్పీ నరసింహ కిశోర్, ఇతర అధికారులు

పోలీస్ శాఖలో

హోంగార్డులు అంతర్భాగం

హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవంలో ఎస్పీ నరసింహ కిశోర్

రాజమహేంద్రవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖలో హోంగార్డులు అంతర్భాగమని ఎస్పీ నరసింహ కిశోర్ పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయ పేరెడ్ గ్రౌండ్‌లో శనివారం నిర్వహించిన హోంగార్డుల 63వ వ్యవస్థాపక దినోత్సవానికి హాజరయ్యారు. మహిళా హోంగార్డులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఆర్ఐ (హోంగార్డ్స్) పరేడ్ నిర్వహించగా ఎస్పీ గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ హోం గార్డులు నిస్వార్థ సేవలందిస్తున్నారని ప్రశం సించారు.అత్యవసర పరిస్థితుల్లో సేవా దృక్పథంతో హోంగార్డులు విధులు నిర్వహి స్తున్నారన్నారు. వారి సేవలు కీలకమని స్పష్టం చేశారు. విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన హోంగార్డులు బీఎస్ఎస్ ఉపేంద్ర(434), పి.వెంకట రమణ(810), వీజీ చౌదరి(353), జీఎస్ఎస్.ప్రకాశ్(932),జి.ప్రవీణ్ కుమార్(1250), వి.సుబ్రహ్మణ్యం(357)కు ఎస్పీ ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందజేశారు. ఉద్యోగ విరమణ పొందిన ఇద్దరు హోంగార్డులకు జిల్లా యూనిట్ హోంగార్డుల ఒక్కరోజు జీతాన్ని ఎస్పీ అంద జేశారు.కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు మురళీ కృష్ణ, సుబ్బరాజు, చెంచిరెడ్డి తదిత రులు పాల్గొన్నారు.



ఎస్పీ నరసింహ కిశోర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న హోంగార్డులు



ఐశ్వరలక్ష్మి హోమం

తాళ్లపూడి మండలం ప్రక్కిలంక భక్తాంజనేయస్వామి ఆలయంలో శనివారం మహిళలు సామూహికంగా ఐశ్వరలక్ష్మి హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా అష్టలక్ష్మి ప్రతిమను తీసుకొచ్చి మహిళలు ఇలా పూజలు చేశారు. - తాళ్లపూడి

వేగంగా ధాన్యం కొనుగోళ్లు



మండలం	రైతులు	కొనుగోలు (టన్నులు)	విలువ (కోట్లలో)	చెల్లింపు (కోట్లలో)
నిడదవోలు	5347	37208.840	84.97	80.45
కొవ్వూరు	2524	23985.080	56.39	52.26
ఉండ్రాజవరం	2931	23136.440	53.02	45.74
బిక్కవోలు	4484	20163.560	44.63	40.17
తాళ్లపూడి	1496	17521.880	40.37	36.10
చాగల్లు	2445	17153.800	39.23	37.07
అనపర్తి	4115	15041.080	32.09	28.53
దేవరపల్లి	1097	14752.760	35.05	30.42
సీతానగరం	1651	13669.640	31.21	26.55
రాజానగరం	1589	12859.280	29.49	27.20
పెరవలి	1728	12728.160	28.92	25.82
నల్లజర్ల	1217	12440.240	28.81	27.42
కడియం	1470	10832.680	25.09	24.07
గోపాలపురం	986	10052.400	23.13	19.91
గోకవరం	929	9115.000	20.80	16.09
కోరుకొండ	731	7064.120	15.51	10.86
రంగంపేట	469	4401.520	10.14	08.55
రాజమండ్రి రూరల్	182	1296.680	02.94	02.87

రాజమహేంద్రవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): 2025-26 ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు వేగంగా సాగుతున్నాయని జేసీ వై.మేఘ స్వరూప్ వెల్లడించారు. ఇప్పటి వరకూ 35,391 మంది రైతుల నుంచి 2 లక్షల 63 వేల 423 టన్నుల సేకరణ జరిగిందన్నారు. వాటి విలువ రూ.601.79 కోట్లు కాగా రైతుల ఖాతాల్లో రూ.540.08 కోట్లు జమైందని చెప్పారు.

కట్టేస్తే.. కూల్చేస్తాం!



అక్రమ నిర్మాణాలపై కొరడా

- రాజమండ్రిలో 900లకు పైగా గుర్తింపు
- బీపీఎస్‌కి కేవలం 27 దరఖాస్తులు
- మోరంపూడిలో ఓ భవనం కూల్చివేత
- ఫిబ్రవరి నెలాఖరు వరకూ అవకాశం
- నోటీసులిచ్చిన అధికారులు
- కొవ్వూరు, నిడదవోలులో ఇంతే
- స్పందించకపోతే కూల్చివేత

(రాజమహేంద్రవరం/సిటీ - ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని నగరాలు, పట్టణాల్లో అనధికార నిర్మాణాలపై అధికార యంత్రాంగం కొరడా ఎత్తింది. ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీలోపు నిర్మించిన వాటిలో నిబంధనలు ధిక్కరించిన వాటికి బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్ (బీపీఎస్) ద్వారా క్రమబద్ధీకరించుకోవడానికి ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. ఈ మేరకు గత నెల 12వ తేదీన జీవో ఇచ్చింది. అప్పటి నుంచి 120 రోజుల్లోపు ఈ స్కీమ్‌ను వినియోగించుకోవాలి. ఇంత వరకూ తక్కువ మంది మాత్రమే స్పందించడంతో అధికార యంత్రాంగం చర్యలకు ఉపక్రమించింది. మోరంపూడిలో నిబంధనలు పాటించని భవనాన్ని గురువారం కూల్చి వేసింది. బీపీఎస్‌ను సద్వినియోగం చేసుకోకపోతే మిగిలిన భవనాల పరిస్థితి ఇంతేనని అధికారులు హెచ్చరిస్తున్నారు.

రాజమండ్రిలో 910 భవనాలు..

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థలో 910కి పైగా అనధికార కట్టడాలు ఉన్నట్టు గుర్తించారు. బీపీఎస్ స్కీమ్ కింద ఇంత వరకూ 26 మంది ఆన్‌లైన్ దరఖాస్తులు చేశారు. మిగిలినవారు స్పందించలేదు. కొవ్వూరు, నిడదవోలు మునిసిపాలిటీల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో అధికారులు అందరికీ నోటీసులు జారీ చేస్తున్నారు. వెంటనే బీపీఎస్ స్కీమ్ వినియోగించుకోవాలని హెచ్చరిస్తున్నా రు. ఫిబ్రవరి నెలాఖరులోపు మాత్రమే ఈ స్కీమ్ అమల్లో ఉంటుంది. ఈ అవకాశాన్ని వినియో గించుకోకపోతే.నిబంధనలు ప్రకారం కూల్చివేతలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు.

కమిషనర్ పట్టుదల..

అక్రమ కట్టడాలను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీపీఎస్ -2025 స్కీమ్‌ను వినియోగించుకోకపోతే ఆయా భవనాలను కూల్చివేయడం తప్పదని కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ అధికారులు హెచ్చరిస్తున్నారు. గతంలో సుమారు 150 కట్టడాలకు నోటీసులు జారీ చేశారు. వాటిలో కొన్ని భవనాల యాజమాన్యాలు కోర్టులకు వెళ్లడం తో వాటిపై స్టే ఆర్డర్లు ఉన్నా యి. ఈ నిర్వాకం కూడా అప్పట్లో నగర పాలక సంస్థ అధికారులు పుణ్యమే. కూటమి ప్రభుత్వం బీపీఎస్‌ను తెరమీదకు తెచ్చి ఆయా అనుమతుల్లేని కట్టడాలను ఈ స్కీమ్‌లో క్రమబద్ధీకరించాలని గత 10 నెలలుగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే పెద్దగా స్పందన లేకపోవడంతో పరిస్థితి సీరియస్‌గా మారింది. ఇటీవల రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ బీపీఎస్, ఎల్ఆర్ఎస్ స్కీమ్‌లపై ప్రస్తావించారు.బీపీఎస్ స్కీమ్ వినియోగించుకోవడం ద్వారా భవనాలు క్రమబద్ధీకరించబడతాయి. ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. ఇప్పటికైనా అక్రమ కట్టడాలు చేసిన వారు బీపీఎస్‌ను వినియోగించుకోవాల్సి ఉంది. ఇప్పటికే కమిషనర్ రాహుల్ మీనా అక్రమ కట్టడాలపై చర్యలు చేపడుతున్నారు. బీపీఎస్ వినియోగించుకోకపోతే కూల్చివేతలు తప్పవు .

ప్లాన్ ధిక్కరిస్తే ఇంతే..

భవనాలు నిర్మించుకునే సమయంలో పలువురు ఒక ప్లాన్ ఇస్తారు. నిర్మించే సమయంలో స్థానిక నేతలు, కిందిస్థాయి ఉద్యోగుల సలహాతో తప్పులు చేస్తారు. మే హరానా అంటే అంతస్తులు..అంతస్తులు కట్టేస్తారు.. నిబంధనలు ధిక్కరిస్తారు. రాజమార్గంలో అధికారికంగా అనుమతులు పొంది భవనాలు నిర్మించుకుంటే సమస్యలురావు. బ్యాంక్ రుణాలు వస్తాయి. కానీ ఎవరిని మోసం చేద్దామనుకుంటారో కానీ పిల్లి కళ్లుమూసు కునిపాలు తాగిన చందాన నిబంధనలు ధిక్క రిస్తారు. అది సమస్యగా మారుతోంది. భవనాల నిర్మాణాల పరిధిని బట్టి, ఆయా ప్రాంతాల్లోని భూమి మార్కెట్ విలువ బట్టి చదరపు మీటరుకు నిర్ణయించిన ప్రకారం ఇవాళ అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంది. వచ్చే పుష్కరాల నేపథ్యంలో సిటీలో అనేక అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. గతంలో మాదిరిగా చూసీచూడనట్టు వదిలేసే పరిస్థితి లేదు. నిబంధనలు ధిక్కరించి నిర్మాణాలు చేసుకున్నవారంతా బీపీఎస్‌ను ఉపయోగించుకుంటే నిర్మాణాలు భద్రంగా ఉంటాయి.

అపరాల సాగుతో నేల ఆరోగ్యం

అపరాల సాగుపై శిక్షణలో వ్యవసాయాధికారి మాధవరావు

కొవ్వూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అపరాల సాగుతో నేల ఆరోగ్యంతో పాటు రైతు ఆదాయం పెంచుకోవచ్చునని జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు అన్నారు. కొవ్వూరు లిటరరీ క్లబ్ క్లబ్ కల్యాణ మండపంలో శనివారం నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ అండ్ న్యూట్రిషన్ మిషన్ (ఎన్ఎఫ్ఎస్ఎన్ఎం) ఆధ్వర్యంలో రైతులకు అపరాల సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు మాట్లాడుతూ అపరాల వురు, బుడెపల వల్ల నత్రజని మొక్కలకు అందుతుందని, దీంతో నేల ఆరోగ్యం, అపరాలు ఉత్పత్తి, రైతుకు ఆదాయం కూడా మెరుగుపడుతుందన్నారు. ప్రతి మండలంలో ఎన్ఎఫ్ఎస్ఎం క్లస్టర్లు ఏర్పాటుచేసి మినుములు, పెసలు, అపరాల విత్తనాల దగ్గర నుంచి పురుగు, తెగుళ్ల మందుల వరకు సబ్సిడీపై రైతులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. డివిజనల్ సహాయ సంచాలకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ మినుముల రకాలు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. పీయూ 31, వీబీఎన్ 8, టీబీజీ 104, ఎల్‌బీజీ 884 రకాలు, వాటికి వచ్చే తెగుళ్ళ, నివారణ పద్ధతులను వివరించారు. అరటి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త రవీంద్రకుమార్ మాట్లాడుతూ నత్తల నివారణ, అరటి, బొప్పాయి, ఉద్యాన పంటల సాగు, సస్య రక్షణ చర్యలు, తెగుళ్ళ,పురుగుల మందుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో డిహెచ్‌వో ఎన్.మాణిక్యాలరావు, డీఏహెచ్‌వో డా.టి.శ్రీనివాసరావు, డా.డి.రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపల్ సైంటిస్ట్ మానుకొండ శ్రీనివాస్, ఫిషరీస్ జేడీ ఎన్.నిర్మలాకుమారి, డా.టి.పద్మలత, ఎస్.కె దిల్షద్, కొవ్వూరు, తాళ్లపూడి, నల్లజర్ల, చాగల్లు, దేవరపల్లి, గోపాలపురం మండలాల వ్యవసాయాధికారులు, ఉద్యాన శాఖాధికారులు, రైతులు పాల్గొన్నారు.

కోతుల నుంచి రక్షణకు మెస్..

అది ఒక ఆశ్రమం.. ప్రసాదం పెడితే చాలు కోతల మూకలు వాలిపోతున్నాయి.. కోతుల నుంచి రక్షణకు ఏం చేయాలని ఆలోచించా రు.. భక్తులకు ప్రసాదం పంపిణీ చేసే ప్రదేశం చుట్టూ ఇనుప కంచె వేశారు.. అయినా పైనుంచి వచ్చి కోతులు దాడి చేస్తున్నాయి..దీంతో పైనుంచి రాకుండా ప్రత్తిపాడు మండలం రాచపల్లి రమణ ఆశ్రమంలో భోజన ప్రదేశం వద్ద ఇనుప మెస్సులు వేశారు. ఈ ఒక్క సంఘటన చాలు కోతి చేష్టల పరిస్థితి చెప్పడానికి..

కోతులు పట్టించేందుకు ఇంటికి రూ.వెయ్యి..

కోతుల అలజడికి తునిరూరల్ గవరపేటలో గ్రామస్తులు ఇళ్ల నుంచి బయటకు రావడానికి హడలెత్తిపోతున్నారు. ఆదమరిస్తే ఇళ్లలోకి చొరబడి తినుబండారాలతో పాటు వంట సామగ్రి ధ్వంసం చేస్తున్నాయి. స్కూల్ పిల్లల వద్ద లంచ్‌బాక్సులు లాక్కుని దాడి చేస్తున్నాయి. కోతుల బెడదతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న గవరపేట గ్రామస్తులు ఏకతాటిపైకి వచ్చారు. ఇంటికొక రూ.1000 చందా వేసి ఒక కోతికి రూ.5 వేల చొప్పున వెచ్చించి వందలాది కోతులను పట్టించారు. వీటిని భద్రంగా ప్రత్యేక వాహనంలో ఏజెన్సీ ప్రాంతానికి తరలించారు. అయినా బెడద మాత్రం తీరలేదు..

కోతులకో కాపలాదారుడు..

రాజానగరం మండలంలో కోతులు పండ్ల తోటలపై ఇష్టానుసారం దాడి చేస్తున్నాయి.. నిమ్మపూత గిల్లడం, బొప్పాయి, అరటి మొక్కలను వేస్తుండగానే పీకేయడం, సీతాఫలాన్ని కాయ దశలోను, జీడిగింజలను తెంపేయడం వంటి కోతిచేష్టలతో రైతులు బాగా నష్టపోవాల్సి వస్తోందని శ్రీకృష్ణపట్నానికి చెందిన రైతు దొడ్డా అర్జున్ వాపోయాడు. కోతుల బారి నుంచి పంటను రక్షించుకోవడానికి రోజుకు రూ.700 నుంచి రూ.వెయ్యి వరకూ జీతాలుగా ఇచ్చి కాపలాదారులను ఏర్పాటు చేసుకుంటున్నారు. అయినా దాడులు ఆగడంలేదు.

వానరకమే!





తహశీల్దార్‌కు గతంలో కూనవరం విజయసాధన పాఠశాల విద్యార్థుల వినతి

కోతులను కొట్టడానికి కర్రలు అమ్ముతారక్కడ?

కూనవరంలో కోతులను తరిమేందుకు దుకాణాల్లో ప్రత్యేకంగా కర్రలను విక్రయిస్తున్నారు. ఎందుకంటే వాటి తీరు అంతదారుణంగా ఉంది. ఇటీవల కూనవరానికి చెందిన చుక్కమ్మ అనే వృద్ధురాలిపై కోతులు దాడిచేయడంతో ఆమె తలకు నాలుగు కుట్లు పడ్డాయి. ఇదే గ్రామానికి చెందిన జట్టి సత్యనారాయణ ఆలయానికి వెళ్లి పూజలు చేస్తుండగా ఆయనపై ఒక్కసారిగా కోతులు దాడిచేసి గాయపరిచాయి. విజయసాధన పాఠశాల విద్యార్థులు కోతుల కారణంగా చదువుకోలేకపోతున్నామని తహశీల్దార్ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.



కోతి చేష్టలు.. ఈ మాట తరచూ వింటుంటాం.. అయితే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ప్రత్యక్షంగా చూస్తున్నారు.. ఇబ్బందులు పడుతున్నారు.. అయినా ఏమీ చేయలేక చేష్టలుడిగి చూస్తున్నారు.. ఎందుకో ఏమో కానీ.. ఎక్కడో వనంలో ఉండాల్సిన కోతులు ఇటీవల జనావాసంలోకి చేరాయి.. ఎక్కడిబడితే అక్కడ కనిపిస్తున్నాయి.. గతంలో కొన్ని ప్రాంతాల్లో మాత్రమే కోతుల జాడ ఉండేది.. నేడు అక్కడా ఇక్కడా అని ఏమీ లేదు. కోతులు అడవులను వదిలి జనాల మీద పడుతున్నాయి.. వానరుడిని ఏమీ చేయలేని నరుడు.. నరకం చూస్తున్నాడు.. అధికారులు చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నాడు.. అయినా చర్యలు శూన్యం..

కోతి మూకల దాడులతో జనం బెంబేలు

- జనావాసంలోకి వానరసేన
- మనుషులు కనబడితే దాడి
- సామగ్రి ఎత్తుకెళ్లిపోతున్న వైనం
- ఉమ్మడి జిల్లాలో మరో కష్టం

ప్రత్తిపాడు/తునిరూరల్/ఏలేశ్వరం/దివాన్‌చెరువు/కూనవరం/ ఆత్రే యపురం/ సామర్లకోట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వనంలో ఉండాల్సిన కోతులు జనంలో సంచరిస్తుండడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. గుంపులు..గుంపులుగా చేరిన కోతులు రైతులకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి.ఊళ్లలోకి చొరబడి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి.ఇంటి పెరట్లోని మొక్కలన ధ్వంసం చేస్తున్నాయి. పంటలు, పండ్ల తోటలు, గృహాల్లోకి చొరబడుతున్నాయి. ఇళ్లలోకి చొరబడి అందినకాడికి నిత్యావసరాలను ఎత్తుకుపోతున్నాయి.

పాఠశాలలకు వెళ్లే చిన్నారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఇటీవల కాలంలో పలువురు వానర మూకల దాడిలో గాయపడి ఆస్పత్రులకు చికిత్స నిమిత్తం వెళ్లిన సంఘటనలు ఉన్నాయి. సామర్లకోటలో కోతులు, కొండము చ్చుల బెడద అధికంగానే ఉంది. సామర్లకోట మాండవ్య నారాయణస్వామి ఆలయం నుంచి భీమేశ్వరాలయం వరకూ ఉన్న రోడ్డు, వ్యవసాయ పరిశోధనా కేంద్రం రోడ్డులోనూ కోతుల బెడద ఉంది. అన్నవరం, అంతర్వేది తదితర పర్యాటక ప్రాంతాల్లోనూ కోతుల దాడి అధికంగానే ఉంటుంది. పంచాయతీ, వ్యవసాయశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వీటి కట్టడికి చర్యలు శూన్యం. ఇప్పటికైనా అటవీ, పంచాయతీరాజ్ శాఖలు సంయుక్తంగా కోతులు పట్టుకుని అటవీ ప్రాంతాలకు తరలించాలని ప్రజలు కోరుతున్నారు.





సామర్లకోట .. అలమండలో

ఇక్కడే.. ఇబ్బంది

ప్రత్తిపాడు, తుని పట్టణానికి ఆనుకుని ఉన్న గ్రామీణ ప్రాం తాలతో పాటు తుని మండలంలో తేటగుంట, గవరపేట, వెంకటాపురం, హంసవరం తదితర గ్రామాల్లో వానరమూక ప్రజలను బెంబేలెత్తిస్తోంది. ఏలేశ్వరం నగర పంచాయతీ పరిధిలో కోతులు బెడద అధికంగా ఉంది. రాజానగరం మండలంలోని శ్రీకృష్ణపట్నం, శ్రీరాంపురం, రఘునాథపురం, పుణ్యక్షేత్రం, తుంగపాడు గ్రామాల్లో పండ్ల తోటలు అధికం. వాతావరణం అనుకూలించినా వానర మూకల వల్ల రైతులు నష్టాలను ఎదుర్కొంటున్నారు.లాలాచెరువు హౌసింగ్‌బోర్డు కాలనీ, దివాన్‌చెరువు తదితర జనావాస ప్రాంతాల్లో కోతుల బెడద అధికంగా ఉంది. కూనవరంలో కోతుల కారణంగా జనం రోడ్లపై తిరగాలంటనే భయపడుతున్నారు.ఆత్రేయపురం మండలం బొబ్బ ర్లంక, ధవళేశ్వరం బ్యారేజీపై కోతులు కాచుకుని అప్పుడప్పుడు వాహన దారులపై దాడులకు దిగుతున్నాయి. ఏలేశ్వరం నగర పంచాయతీ పరిధిలో 20వ వార్డుల్లో ప్రజలు ప్రత్యక్షంగా పరోక్షంగా ఇబ్బందులకు గురవుతున్నారు. వీటిని కొట్ట లేరు.. అలాగని పట్టుకోరు.. ఈ మూగజీవాలతో పట్టణంలో 40వేల జనాభాకు నిత్యం నరకం కనిపిస్తోంది. ప్రస్తుతం ఉన్న కఠినమైన చట్టాలతో వీటి సమస్య నానాటికీ ఇబ్బందికరంగా మారుతోంది.

ఒకే విద్యార్థి.. ఒకే టీచరు!

- సామర్లకోట మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఇది పరిస్థితి

(ఆంధ్రజ్యోతి-సామర్లకోట)



సామర్లకోటలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థిని, టీచరు

ఇది కాకినాడ జిల్లా సామర్లకోట మున్సి పాల్టీ పరిధిలోని కోదండరామపురం మున్సిపల్ ప్రాథమిక పాఠశాల.. ఇక్కడ ఒకే టీచర్ విధులు నిర్వహిస్తుండగా ఒకే విద్యార్థి విద్యాభ్యాసం చేస్తున్నారు. ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నా, లక్షలాది రూపాయల మేర ఉపాధ్యాయులకు వేతనాల రూపంలో చెల్లిస్తున్నా సర్కారు బడుల వైపు తల్లిదండ్రులు మొగ్గు చూపడం లేదు. చిన్నారుల హాజరు తక్కువగా ఉండడానికి ఇదొక కారణమైతే పాఠశాలల విలీనం మరొక కారణంగా తెలుస్తోంది. మండలానికి ఇద్దరు ఎంఈవోలు, సీఆర్‌పీ వ్యవస్థలు ఉన్నా చిన్నారులను ప్రభుత్వపాఠశాలల వైపు రప్పించలేకపోతున్నారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. జిల్లా కేంద్రమైన కాకినాడకు 15 కిలోమీటర్ల దూరంలో ఈ పాఠశాల ఉంది. ఇక్కడ ఒకే విద్యార్థి కీర్తి, ఒకే టీచరు గౌతమి మాత్రమే ఉన్నారు. ఈ పాఠశాలకు మధ్యాహ్న భోజన పథకం కూడా అమలు కావడం లేదు.

జీలుగు నీరా నుంచి బెల్లం తయారీ

- అధిక లాభాలు పొందొచ్చు
- పందిరిమామిడి ఉద్యాన పరిశోధనా క్షేత్రం శాస్త్రవేత్త డాక్టర్ వెంగయ్య
- మోతుగూడెంలో జీలుగుకల్లు సేకరణదారులకు శిక్షణ



జీలుగు నీరా నుంచి బెల్లం తయారీపై శిక్షణ ఇస్తున్న వెంగయ్య

మోతుగూడెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కొండలపై సహజ సిద్ధంగా పెరిగిన జీలుగు చెట్ల నుంచి నీరా సేకరించి బెల్లం తయారు చేయడం ద్వారా మంచి ఆదాయాన్ని పొందవచ్చని సీనియర్ శాస్త్రవేత్త, పందిరిమామిడి ఉద్యాన పరిశోధనా క్షేత్రం శాస్త్రవేత్త డాక్టర్ పీసీ వెంగయ్య తెలిపారు. జీలుగు బెల్లం తయారీపై ఆయన శిక్షణ ఇచ్చారు. చింతూరు మండలం మోతుగూడెం ఎంసీడీ క్యాంప్‌లో ఆషా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి వెంగయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

పాత పద్ధతిలో సేకరిస్తున్న జీలుగు కల్లుకు బదులుగా కొత్త పద్ధతిలో పరిశుభ్రంగా నీరా ఎలా సేకరించాలి.. తద్వారా బెల్లం ఎలా తయారు చేయొచ్చు అనే అంశాలపై ఆయన శిక్షణలో పాల్గొన్న అభ్యర్థులకు నేర్పించారు. ఈ సందర్భంగా వెంగయ్య మాట్లాడుతూ ఒక్కొక్క చెట్టునుంచి సీజన్ మొత్తంలో కనీసం 100 రోజులు నీరా సేకరించి నా రోజుకు 30 లీటర్ల చొప్పున 3000 లీటర్ల ఉత్పత్తి చేయవచ్చునని అన్నారు. శుభ్రంగా నీరా సేకరించి బెల్లం తయారు చేస్తే తామే కొనుగోలు చేస్తామని తెలిపారు. ఉత్సాహం ఉన్న కొంతమందిని గుర్తించి వారికి తగిన పనిముట్లు, పరికరాలను తమ ఉద్యాన పరిశోధన కేంద్రం తరఫున ఉచితంగా అందిస్తామని, మరికొన్ని శిక్షణలు ఇప్పించి ఈ ప్రాంతంలోని యువతకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమానికి తడికవాగు, ఇంతలూరు వాగు, ఒడియా క్యాంప్, సింధువాడ, గంగవాడ, శాంతినగరం గ్రామాల నుంచి 24 మంది జీలుగు కల్లు సేకరణదారులు పాల్గొన్నారు. జీలుగు నీరాతో బెల్లం చేసి అమ్మితే ఉపాధి పొందవచ్చునని ఆషా సంస్థ కార్యదర్శి శ్రీసయ్యద్ సుభాని అన్నారు.

అత్యాధునిక వైద్యంపై

అవగాహన పెంచుకోవాలి

- ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజియోథెరపిస్ట్ సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ సురేష్‌బాబురెడ్డి



కిమ్స్‌లో ఫిజియోథెరపీపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సురేష్‌బాబురెడ్డి

అమలాపురంరూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఫిజియోథెరపీలో అత్యాధునిక వైద్య విధానాలు ఎన్నో అందుబాటులోకి వచ్చాయని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజియోథెరపిస్ట్ సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ సురేష్‌బాబురెడ్డి పేర్కొన్నారు. అమలాపురం కిమ్స్ వైద్య కళాశాలలో రెండురోజులపాటు సదర్న్ ఫిజియోస్ వార్షిక పరిశోధన-సాంస్కృతిక మహాసభ-2025 శనివారంతో విజయవంతంగా ముగిసింది. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 800 మంది ఫిజియోథెరపిస్టులు, ఫిజియోథెరపీ విద్యార్థులు మహాసభల్లో పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ సురేష్‌బాబు బేసిక్ ఎమర్జెన్సీ ప్రొసీజర్స్ టేపింగ్ టెక్నిక్, మాన్యువల్ థెరపీ, తదితర అంశాలపై వర్క్‌షాపులో విద్యార్థులకు వివరించారు. వీటితో పాటు దంతవైద్య, ఫిజియోథెరపీ రంగాల్లో నిపుణులు పీఎంఏలు నిర్వహించారు. ప్రముఖ సినీనటి శ్రీదేవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శ్రీదేవితో కలసి విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కిమ్స్ డీన్ డాక్టర్ ఆనంద్ ఆచార్య, ఉపాధ్యక్షుడు మోహన్ రాజు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి. సుబ్బారావు ఆహూతులను సత్కరించారు. అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన వైద్యుల బృందాన్ని కిమ్స్ చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు), ఎండీ కె.రవికిరణ్‌వర్మ, ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ అశోక్‌చక్రవర్తి అభినందించారు.

కూలీల చేతిలో రక్తపింజర హతం



ఆర్.ఏనుగుపల్లిలో వరి చేల్లో రక్తపింజరను చంపిన కూలీలు

పి.గన్నవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం మండలం ఆర్.ఏనుగుపల్లిలో శనివారం వరి చేల్లో కూలీలు రక్తపింజరను హతమార్చారు. గ్రామంలోని ఏటిగట్టు దిగువన పనలు కడుతుండగా రక్తపింజర కనిపించింది. అత్యంత ప్రమాదకరమైన విషసర్పం కావడంతో కూలీలు కర్రలతో కొట్టి చంపారు. గత కొన్ని రోజులుగా పరిసర ప్రాంతాల్లో రక్తపింజర పాములు ఎక్కువగా కనిపించడంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

అమలాపురం రూరల్: అమలాపురం మండలం సమనస గ్రామానికి చెందిన మంచిగంటి మణికంఠ స్వగృహం వద్ద నిర్వహిస్తున్న డెయిరీఫామ్‌లో రక్తపింజర కనిపించింది. నెల రోజుల క్రితం కనిపించగా, దాని ఆచూకీ కోసం యజమాని వెతికాడు. కానీ కనిపించకపోవడంతో రెండు పర్యాయాలు స్నేక్ క్యాచర్ జంపన రమేష్‌వర్మకు సమాచారం అందించారు. కగా, ఎట్టకేలకు శనివారం రాత్రి కన్నం నుంచి బయటకు రావడంతో వర్మకు సమాచారం అందించడంతో హుటాహుటిన ఆయన అక్కడకి చేరకుని అత్యంత ప్రమాదకరమైన రక్తపింజరని పట్టుకుని బంధించాడు. దీంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు.



సమనసలో ఓ డబ్బాలో బంధించిన పాముతో స్నేక్ క్యాచర్

ఆధ్యాత్మికభావం అవసరం

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్
- అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో పూజలు



సత్యదేవుడి దర్శనానంతరం మంత్రి సుభాష్

అన్నవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరికీ ఆధ్యాత్మికభావం అవసరమని రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శనివారం ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం సత్యదేవుడ్ని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం

దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యన్నదాన పథకానికి శనివారం ఒక దాత రూ. లక్ష విరాళంగా సమర్పించారు. సత్తుపల్లికి చెందిన పి.కృష్ణారావు ఈ మొత్తాన్ని ఆలయ ఈవో సుబ్బారావుకు అందజేయగా దాతను ఆయన అభినందించి వారికి స్వామి వారి ప్రసాదం, ప్రత్యేక దర్శనం కల్పించారు.

వేడుకగా ప్రాకార సేవ

రత్నగిరి వాసుడైన సత్యదేవుడికి శనివారం ప్రాకారసేవ వేడుకగా జరిగింది. ఉదయం 9 గంటలకు ప్రధానాలయం నుంచి స్వామి, అమ్మవార్లను తిరుచ్చివాహనంపై ఆశీనులు గావించి తూర్పురాజగోపురం వద్దకు తోడ్కొనివచ్చారు .అక్కడ ప్రత్యేక పూజలు అనంతరం భక్తుల గోవిందనామస్మరణలు, పండితుల వేదమంత్రోచ్చరణల నడుమ ముమ్మారు ప్రదక్షిణ గావించారు. కార్యక్రమం అనంతరం హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు.

భక్తజన వాస గోవిందా

- వాడపల్లి వెంకన్న ఆలయానికి పోటెత్తిన జనం
- స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.56,75,591 లక్షలు



ఆలయంలో భక్తుల రద్దీ

ఆత్రేయపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం గోవిందనామస్మరణతో మార్మోగింది. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలభోగం, తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో వేదపండితులు అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే ఆలయం ఎదురుగా ఉన్న దీపారాధన మండపంలో మహిళలు దీపాలంకరణ చేశారు. బస్టాండ్ వద్ద మహిళల సందడి నెలకొంది. కొత్త వంతెన నుంచి ఆలయం వరకు బ్యాటరీ వాహనాల ద్వారా భక్తులను ఆలయానికి తీసుకువచ్చారు. 104 వైద్యసిబ్బంది సేవలు అందించారు. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు ఆలయంలో పర్యవేక్షించారు. రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. భక్తజన గోవిందనామస్మరణతో ఆలయం మార్మోగింది. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ. 56,75,591 లక్షలు లభించినట్టు ఉప కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

బాలబాలాజీకి విశేష పూజలు

మామిడికుదురు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీస్వామికి శనివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం దేవస్థానం భక్తులతో పోటెత్తింది. వేకువజామునే అర్చకులు వేదమంత్రోచ్చారణలతో సుప్రభాత సేవ నిర్వహించి ఘనంగా తొలి హారతి ఇవ్వగా, స్వీకరించిన భక్తులు తన్మయత్వం చెందారు. కొత్త పాత ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్వామివారిని శనివారం 5200 మంది భక్తులు దర్శించుకున్నారు. అన్నప్రసాదం ట్రస్టులో దాదాపు మూడు వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ ఆర్జిత సేవల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ. 2,94,060 ఆదాయంగా సమకూరిందని సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే నిత్యాన్నదాన పథకానికి రాజమహేంద్రవరానికి చెందిన బి.విజయ్‌శంకర్-సుజాత దంపతులు రూ.10,009 విరాళంగా అందించారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఏసీ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.



కొలువుదీరిన బాలబాలాజీ స్వామి

సిద్ధి వినాయకుడి సన్నిధిలో సమాచారశాఖ కమిషనర్



అయినవిల్లిలో సునీల్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న అర్చకులు, అధికారులు

అయినవిల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ (విజయవాడ) చావలి సునీల్‌కుమార్ శనివారం కుటుంబ సమేతంగా అయినవిల్లి శ్రీసిద్ధి వినాయకస్వామిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. తొలుత వీరికి ఆలయ మర్యాదలతో అర్చకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం పండితులు వేదాశీర్వచనం అందజేసి శేషవస్త్రంతో సత్కరించారు. తర్వాత విఘ్నేశ్వరస్వామి చిత్రపటం, ప్రసాదమిచ్చారు.

సామర్లకోట: సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ సునీల్‌కుమార్ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమరావతి నుంచి జిల్లా పర్యటనార్థం విచ్చేశారు. ఆయనకు ఆలయ ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి సుందరరామయ్య (రాంబాబు), వెంకన్న, అంజిబాబు, తదితరుల వేదమంత్రోచ్చారణల మధ్య సాదరంగా స్వాగతం పలికారు. ముందుగా కాలభైరవస్వామిని దర్శించి ఆలయ ఆవరణలోని అన్ని ఉపాలయాల దేవతామూర్తులను దర్శించారు. తర్వాత భీమేశ్వరస్వామికి విశేష అభిషేక పూజలు, బాలాత్రిపుర సుందరి అమ్మవారికి విశేష పుష్పార్చన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ సునీల్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసినవారిలో కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు, సామర్లకోట తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ వై. శ్రీనివాసు, పెద్దాపురం ఎస్‌ఐ మౌనిక, సామర్లకోట వీఆర్వోలు నలజర్ల మురళీకృష్ణ, నూతలపాటి లోవరాజు, తదితరులు ఉన్నారు. అనంతరం ద్రాక్షారామకు ప్రత్యేక వాహనంలో తరలివెళ్లారు. ఈయన తోపాటు అధికారులు, తదితరులు ఉన్నారు.

ఉమ్మడి జిల్లా అండర్ - 17 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక



ఎంపికైన క్రికెట్ జట్టు

అంబాజీపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అంబాజీపేట జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో శనివారం జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ కె.ఈశ్వరరావు, ఎ.రమాదేవి పర్యవేక్షణలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్-17 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 250 మంది క్రీడాకారులు పాల్గొనగా వీరిలో అల్‌రౌండర్, బ్యాట్స్‌మెన్, బౌలర్, కీపర్ సామర్థ్యాలను కలిగిన 16 మంది క్రికెట్ జట్టు ఎంపిక చేయడం జరిగిందన్నారు. అలాగే వీరితో పాటు మరో 8 మందిని స్టాండ్ బై సెలక్ట్ చేయడం జరిగిందన్నారు. ఈ నెల 15 నుంచి విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో ఈ జట్టు పాల్గొంటుందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సాయిరాం, సెలక్టర్లు ఆర్.నాగకుమార్, తోట రవి, పి. శ్రీనివాస్, సీహెచ్ శేఖర్, ధర్మశేఖర్, పవన్ కిషోర్, శ్రీనివాస్, పీడీ కుంపట్ల ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి జేఎన్టీయూకేలో రాష్ట్రస్థాయి
చెకుముకి సైన్స్ సంబరాలు



సంబరాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 23 వరకు కాకినాడ జేఎన్టీయూకేలో రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్‌సంబరాలు నిర్వహిస్తున్నట్లు జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. శనివారం కాకినాడ యూటీఎఫ్ హోంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక ప్రజల కోసం సైన్స్, ప్రగతి కోసం సైన్స్ అంటూ శాస్త్ర విజ్ఞాన ప్రచారం చేస్తూ చైతన్యపరుస్తోందన్నారు. రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో 200మంది విద్యార్థులు వారి తల్లిదండ్రులు, 200మంది ఉపాధ్యాయులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.త్రిమూర్తులు, జి.మురళీధర్, జిల్లా అధ్యక్షుడు కేఎంఎంఆర్ ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్ వర్మ, జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్. సూర్యనారాయణ, ఎం.రామకృష్ణ, జిల్లా గౌరవా ధ్యక్షుడు వి.సత్యనారాయణరెడ్డి, నగర అధ్యక్షుడు డాక్టర్ ఆలపాటి శ్రీనివాస్, పెన్షనర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు, అయితా బత్తుల రామేశ్వరరావు, వర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ అబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి అంతర విశ్వవిద్యాలయాల
పురుషుల వాలీబాల్ పోటీలు

జేఎన్టీయూకే, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో సౌత్‌జోన్ అంతర విశ్వవిద్యాలయాల పురుషుల వాలీబాల్ పోటీలు ఈనెల 10 నుంచి 14 వరకూ జరుగనున్నాయని రిజిస్ట్రార్ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. ఈ టోర్నమెంట్లో సుమారుగా 138 జట్లు పాల్గొంటున్నాయన్నారు. ఈ పోటీలను 4 పూల్స్‌గా విభజించామన్నారు. పూల్ ఏ, బీ పోటీలు జేఎన్టీయూ మైదానంలోనూ.. పూల్ సీ పోటీలు అచ్చంపేటలోని రాజీవ్ గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ క్యాంపస్‌లోనూ... పూల్ డీలోని జట్లకు సంబంధించిన పోటీలు సూరంపాలెంలోని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలోనూ జరుగతాయని తెలిపారు. 6రాష్ట్రాల నుంచి 2 వేల మంది క్రీడాకారులు, 250 మంది కోచ్‌లు, మేనేజర్లు, 100 మంది వరకూ వాలీబాల్ టెక్నికల్ అఫీషియల్స్ పాల్గొంటున్నారన్నారు. ఈ పోటీల్లో మొదటి 4 స్థానాల్లో నిలిచిన జట్లు అఖిల భారతస్థాయి పోటీలకు అర్హత సాధిస్తాయని ఆయన తెలిపారు.

10 వరకూ ఆన్‌లైన్‌లో
ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్

జేఎన్టీయూకే రిజిస్ట్రార్ శ్రీనివాసరావు

జేఎన్టీయూకే, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూకే ఆధ్వర్యంలో నాణ్యత హామీ, సంస్థ ప్రతిష్ఠ, అక్రిడిటేషన్ ర్యాంకింగ్స్‌పై దృష్టి అనే అంశంపై నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ఈనెల 10 వరకూ ఆన్‌లైన్‌లో కొనసాగుతుందని రిజిస్ట్రార్ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. దీనికి చైర్మన్‌గా సివిల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు, ఈసీఈ అసోసియేట్ ప్రొఫెసర్ లీలాకుమారి సమన్వయకర్తగానూ వ్యవహరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వర్సిటీ అనుబంధ, క్యాంపస్ కళాశాలల నుంచి 348మంది అధ్యాపకులు పాల్గొంటున్నారన్నారు. వరంగల్, రూర్కెలా ఎన్ఐటీలు, సూరత్కల్ ఎన్ఐటీకే, ఓయూ, విట్ వంటిసంస్థల నిపుణులు, ఎన్‌బీఏ, న్యాక్ అక్రిడిటేషన్, ఎన్ఐఆర్ఎఫ్, పరిశోధనా సంస్కృతి, విద్యాప్రావీణ్యత వంటి అంశాలపై సాంకేతిక సెషన్లను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 1న ప్రొఫెసర్ రమేష్, 2న ప్రొఫెసర్ శరత్‌బాబు, 3న వేణుగోపాల్, 4న ఏసురత్నం, 5న శర్మ నిరంతర నాణ్యతాభివృద్ధి, కోర్సు ఫైల్స్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. శనివారం ప్రొఫెసర్ ఉగ్రసేన్‌సుమన్ సార్ ప్రమాణాల డాక్యుమెంటేషన్‌పై వివరించారు. ఈ కార్యక్రమం అధ్యాపకుల్లో నైపుణ్యాభివృద్ధికి సంస్థల నాణ్యత పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.

రేపటి నుంచి నన్నయలో పీజీ స్పాట్ అడ్మిషన్లు

ఉపకులపతి ఆచార్య ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో మూడు క్యాంపస్‌లలో పీజీ కోర్సులకు ఈ నెల 8నుంచి 12 వరకూ స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలను విశ్వవిద్యాలయంలో శనివారం ఆమె తెలియజేస్తూ నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్‌లలో పీజీ కోర్సులకు రాజమహేంద్రవరంలో క్యాంపస్‌లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామని చెప్పారు. ఎంఏ, ఎంకామ్, ఎంపీఈడీ, ఎంఎస్సీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్‌లు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఏపీ పీజీసెట్‌లో అర్హత సాధించలేని వారు, సెట్‌కు హాజరు కాని అభ్యర్థులు పీజీ స్పాట్ అడ్మిషన్లలో ప్రవేశం పొందవచ్చన్నారు. సైన్స్ కోర్సులకు 8,9 తేదీల్లోను, ఆర్ట్స్ కోర్సులకు 10,11 తేదీల్లోను, ఏమైనా సందేహాలు, పెండింగ్‌లో ఉన్న సర్టిఫికెట్లు కోసం 12న స్పాట్ అడ్మిషన్‌లు జరుగుతాయని తెలిపారు. నన్నయ రాజమహేంద్రవరం క్యాంపస్‌లో డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ జరిగే ఈ ప్రక్రియను డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఎస్.నజనారాజ్ పర్యవేక్షిస్తారన్నారు. ఏపీ పీజీసెట్ 2025లో అర్హత సాధించిన అభ్యర్థులు రూ.500, పీజీ సెట్ అర్హత లేనివారు, పీజీ సెట్‌కు హాజరు కాని వారు రూ.800 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని వీసీ సూచించారు.

రేపు కాకినాడలో జాబ్ మేళా

కాకినాడ సిటీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వికాస ఆధ్వర్యంలో ఈ నెల 8న కాకినాడలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఈ మేళాలో పలు కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఈ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, బీటెక్ ఉత్తీర్ణులైన 40ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి గల వారు సోమవారం ఉదయం 9గంటలకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్దకు హాజరు కావాలన్నారు. వివరాలకు 77993 76222 నెంబరును సంప్రదించాలన్నారు.


ఏపీలో బీజేపీ బలపడదు

మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్

రాజమహేంద్రవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీది బయోలాజికల్ పుట్టుక కాదు. తాను దేవుడనని మోదీనే స్వయంగా చెప్పుకుంటున్నారు. రాష్ట్రంలోని రెండు పార్టీలు మోదీకి అనుకూలంగా మారిపోయాయని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ ఎద్దేవా చేశారు. రాజమహేంద్రవరంలోని ధర్మంచర హాల్‌లో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. డిసెంబరు 6న రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ వర్ధంతి కానీ బాబ్రీ మసీదును కూల్చి రాజ్యాంగాన్ని తుంగలో తొక్కిన రోజు కూడా ఇదే. ఏ ప్రభుత్వానికైనా అపరిమిత హక్కులు కల్పించి ప్రజలు మౌనంగా ఉంటే ఆదేశం పతనమవుతుందని ఆనాడే అంబేడ్కర్ చెప్పారని గుర్తు చేశారు. ఇండియా-పాకిస్తాన్ మధ్య తాను రాజీ చేశానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెబుతుంటే మోదీ కనీసం స్పందించకపోవడం ఏంటని ఆయన ప్రశ్నించారు. హిందుత్వం మతం కాదు. అదో సంస్కృతి. సనాతన ధర్మం. అది ఎప్పటికీ పోదు. మనది సెక్యులర్ దేశమని చెప్పారు. పాకిస్థాన్ గురించి భయపడాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు. రాజకీయ పరమైన యుద్ధాలను మతపరంగా మార్చి, ప్రజల మధ్య గొడవలు పెడుతున్నారన్నారు. నెహ్రూను దుర్మార్గుడిగా చిత్రీకరిస్తున్న మోదీకి చరిత్ర తెలియదన్నారు. కాంగ్రెస్ ఉనికి లేకుండా చేయడమే బీజేపీ లక్ష్యంగా మాట్లాడుతోందని తెలిపారు.ఆంధ్రలో ఎప్పటికీ బీజేపీ బలపడలేదని స్పష్టం చేశారు. అమాయక భారతీయులను చంపేస్తున్న టెర్రరిస్టులను కాల్చిపడేయాల న్నారు. కోనసీమలో దెబ్బతిన్న కొబ్బరిచెట్ల పరిస్థితిని గురించి చెప్పే సమయంలో తెలంగాణ దిష్టితగిలిందని పవన్ కల్యాణ్ అనడం సరికాదన్నారు. ప్రపంచ నలుమూలల నుంచి రాష్ట్రానికి పెట్టుబడులు తెస్తున్న చంద్రబాబు, మాజీ ముఖ్యమంత్రి జగన్ తమ వ్యాపార సంస్థలను ఆంధ్రకు ఎందుకు తేవడం లేదని ప్రశ్నించారు.

ముందుగా మేల్కొంటే.. ముప్పుండదు!

- స్క్రబ్ టైఫస్ ప్రాణాంతకం కాదు
- దీర్ఘకాలిక రోగులకు వైద్యుల పర్యవేక్షణ తప్పనిసరి
- కంగారు వద్దంటున్న వైద్యులు



జీజీహెచ్(కాకినాడ), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్క్రబ్ టైఫస్ అనేది ఒక రకమైన జ్వరం. అది నల్లివంటి పురుగు కుట్టిన పిదప ఓరియెన్షియా సుస్ట్ సుగుమాషీ అనే బ్యాక్టీరియా ద్వారా మనిషిలో సంక్రమిస్తుంది. తొలుత జ్వరం వచ్చి పిదప దద్దుర్లుతో కూడిన నల్లటి మచ్చ ఏర్పడుతుంది. దానిని ఎస్కార్ అంటారు. ఈ లక్షణాలను గుర్తించిన వెంటనే దగ్గరలోని పీహెచ్‌సీ లేదా యూపీహెచ్‌సీ లేదా ఏరియా ఆసుపత్రి లేదా జిల్లా ఆసుపత్రికి వెళితే తక్షణం వైద్యం అందించడం ద్వారా ఈ స్క్రబ్ టైఫస్‌ను తరిమి వేయవచ్చు. మధుమేహం, రక్తపోటు, హృద్రోగం, క్షయ తదితర దీర్ఘకాలిక వ్యాధులున్నవారు అప్రమత్తంగా ఉండి స్క్రబ్ టైఫస్ లక్షణాలు కనబడితే వెంటనే అర్హుడైన వైద్యుడిని సంప్రదించాలి. తద్వారా అటువంటి వారికి వైద్యులు డాక్సీ సైక్లిన్, ఎరిత్రోమైసిన్ తదితర ఔషధాల ద్వారా వ్యాధిని నియంత్రిస్తారు.

జీజీహెచ్‌లో 155 మందికి పాజిటివ్

ఇప్పటివరకు కాకినాడ జీజీహెచ్‌లోని వీఆర్‌డీఎల్ ల్యాబ్‌లో నిర్వహించిన వైద్య పరీక్షల్లో 155 మందికి స్క్రబ్ టైఫస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. అనంతరం వారందరిని దపదఫాలుగా జీజీహెచ్‌లో వైద్యుల ప్రత్యేక పర్యవేక్షణలో చికిత్స అందించి డిశ్చార్జ్ చేయడం జరిగింది. గడిచిన నెల రోజులుగా కాకినాడ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జె.నరసింహనాయక్, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ఇంజేటి ప్రభాకర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాలు, పాఠశాలలు, వసతిగృహాల్లో స్క్రబ్ టైఫస్ జ్వరాలపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించి వ్యాధి లక్షణాలు, చికిత్సపై వివరించారు. అలాగే పీహెచ్‌సీ వైద్యాధికారులకు జూమ్ మీటింగ్ నిర్వహించి కేసులు వస్తే చికిత్స పద్ధతులపై వివరించారు.

అంటువ్యాధి కాదు



వ్యాధినిరోధక శక్తి బాగా ఉండి పూర్తి ఆరోగ్యవంతులుగా ఉన్నవారికి స్క్రబ్ టైఫస్ వ్యాధి ప్రాణాంతకం కాదు. వ్యాధి లక్షణాలు గుర్తించిన వెంటనే ఆసుపత్రికి తరలించి వైద్యం అందించి పూర్తిగా నియంత్రించవచ్చు. ఇది ఒకరి నుంచి మరొకరికి సంక్రమించే అంటువ్యాధి కాదు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలోను ఈ వ్యాధికి సంబంధించిన మందులు పూర్తి స్థాయిలో ఉన్నాయి. స్క్రబ్ టైఫస్ పట్ల ఎవరు ఆందోళన చెందవలసిన అవసరం లేదు. ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి స్వీయ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత అవసరం.

- డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నాయక్, కాకినాడ

'తూర్పు'లో కేసులు నమోదు కాలేదు

రాజమహేంద్రవరం అర్బన్: తూర్పుగోదావరి జిల్లాలో ఇప్పటి వరకూ స్క్రబ్ టైఫస్ కేసులు నమోదు కాలేదు. అప్రమత్తంగా ఉన్నాం, మందులు సిద్ధంగా ఉన్నాయి. జిల్లాలో అన్ని ఆసుపత్రుల్లో మలేరియా పరీక్ష ల నిమిత్తం 4,29,911 మందికి రక్తపరీక్షలు నిర్వహించగా ఎలాంటి పాజిటివ్ మలేరియా కేసులు నమోదు కాలేదు. 2,872 మందికి డెంగ్యూ పరీక్షలు చేయగా 32 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. చికెన్ గునియా కేసులు కూడా నమోదు కాలేదు. జీజీహెచ్‌లో స్క్రబ్ టైఫస్ నిర్ధారణ కోసం ర్యాపిడ్ టెస్టింగ్ కిట్లు అందుబాటులో ఉంచారు. ప్రస్తుతం 20 స్క్రబ్ టైఫస్ నిర్ధారణ ర్యాపిడ్ కిట్లు సిద్ధం చేశారు.

- డీఎంహెచ్‌వో, డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, తూర్పుగోదావరి జిల్లా

ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం



అమలాపురం (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో స్క్రబ్ టైఫస్ వ్యాధిపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. జిల్లాలో 11 నెలల్లో 177 పరీక్షలు నిర్వహించగా 17 స్క్రబ్ టైఫస్ కేసులు నమోదయ్యాయి. వారందరికీ సకాలంలో వైద్య సేవలు అందించడంతో పూర్తిగా కోలుకున్నారు. నల్లిని పోలిన చిన్న కీటకం కుట్టడం వల్ల ఈ వ్యాధి వస్తుంది. శరీరంపై నల్లటి ఎస్కార్ మచ్చ ఏర్పడుతుంది. వారం, పది రోజుల తరువాత జ్వరం, చలి, వణుకు, తలనొప్పి, కండరాల నొప్పులు, జీర్ణ సమస్యలు, శ్వాస రూపంలో ఇన్ఫెక్షన్‌వస్తుంది. ఈ వ్యాధి బారిన పడిన వారికి సాధారణ అంటీబయాటిక్స్‌తో వ్యాధి నయమయ్యే అవకాశం ఉంది. సకాలంలో చికిత్స అందకపోతే కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉంది. కాకినాడ వంటి ప్రధాన ఆసుపత్రిలో గల ల్యాబ్‌లో పరీక్షలు చేస్తున్నారు. అనుమానిత కేసులు గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ రావడం వల్ల వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి ముందస్తు నివారణ చర్యలు తీసుకుంటున్నాం.

- డీఎంహెచ్‌వో, ఎం.దుర్గారావుదొర, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

ప్రభుత్వ కళాశాల వద్ద విద్యార్థుల ఘర్షణ

పోలీసుల కౌన్సిలింగ్

పిఠాపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణ శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మెగా టీచర్ మీటింగ్ జరుగుతున్న సమయంలోనే కళాశాల బయట ఈ సంఘటన జరిగింది. ఇటీవల తరచూ విద్యార్థులు మధ్య వివాదాలు, ఘర్షణలు జరుగుతున్న నేపథ్యంలో ఘర్షణకు దిగిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పట్టణ పోలీసుస్టేషన్ వద్ద కళాశాల అధ్యాపకుల సమక్షంలో సీఐ శ్రీనివాస్ సమావేశం నిర్వహించారు. విద్యార్థులు ఎటువంటి గొడవలు, ఘర్షణలకు దిగినా, అసాంఘిక కార్యకలాపాల్లో పాల్గొన్నా కఠినచర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. మళ్లీ ఇటువంటి సంఘటనలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని, దీని వల్ల భవిష్యత్తులో ఉద్యోగం పొందే అవకాశాలను కోల్పోతారని తెలిపారు. కౌన్సిలింగ్ అనంతరం ఘర్షణకు దిగిన విద్యార్థులను వారి తల్లిదండ్రులకు అప్పగించారు. సమావేశంలో ఎస్ఐ మణికుమార్ తదితరులున్నారు.



పిఠాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న సీఐ

భూపాలపట్నంలో వ్యక్తి హత్య?

దర్యాప్తు చేస్తున్న పోలీసులు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



అప్పన్న (ఫైల్)

కిర్లంపూడి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం భూపాలపట్నం గ్రామానికి చెందిన కాకర అప్పన్న(48)ను హత్య చేసినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శుక్రవారం రాత్రి గ్రామంలోని మెయిన్ రోడ్డులో అప్పన్న అనుమానాస్పదంగా మృతిచెందాడు. అటుగా వెళ్లే ఆటో డ్రైవర్ చూసి పోలీసులకు సమాచారం అందించాడు. జగ్గంపేట, ప్రత్తిపాడు సీఐలు వైఆర్‌కె శ్రీనివాస్, వెంకట అప్పారావు, కిర్లంపూడి ఎస్ఐ సతీష్, జగ్గంపేట ఎస్ఐ రఘునాధరావు సంఘటన స్థలానికి చేరుకున్నారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు.హత్య కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

గతంలో ఘర్షణ...

కాకర అప్పన్నకు గ్రామానికి కుళ్ల రాజబాబుకు 2024 సెప్టెంబరు 3న ఘర్షణ జరిగింది. తర్వాత గ్రామంలో కిల్లీకొట్టు వద్ద రాజబాబుపై అప్పారావు ఐరన్ రాడ్డుతో కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. అప్పట్లో అప్పారావుపై హత్యాయత్నం కేసు నమోదైంది. ఇంకా కోర్టులో నడుస్తోందని స్థానికులు తెలిపారు. ఇదిలా ఉండగా శుక్రవారం రాత్రి బహిర్భూమికి వెళ్లి వస్తున్న అప్పారావును రాజబాబు, మరి కొందరు కలిసి కొట్టి చంపారని మృతుడి సోదరుడు కాకర రాజేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కిర్లంపూడి ఎస్ఐ సతీష్ తెలిపారు. పోలీసు జాగిలం ఘటనా స్థలం నుంచి నేరుగా కుళ్ల రాజబాబు ఇంటికెళ్లి ఆగింది. దీంతో రాజబాబు హత్య చేసి ఉంటాడని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

మరొకరికి ఆసుపత్రిలో చికిత్స

తొండంగి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తొండంగి మండలం అద్దరిపేట పెట్రోల్ బంక్ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కుమ్మరి సుబ్బారావు(59) దుర్మరణం పాలైనట్టు పోలీసులు తెలిపారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం రాజీపేటకు చెందిన కుమ్మరి సుబ్బారావు, తన బంధువు నేమాల రామకృష్ణతో కలిసి ఉదయం ఈదటం గ్రామానికి మోటార్‌సైకిల్‌పై వెళ్లారు. మధ్యాహ్నం తిరిగి వస్తుండగా పెట్రోల్ బంక్ సమీపంలో వెనుక నుంచి వేగంగా వస్తున్న మరో మోటార్‌సైకిల్ బలంగా ఢీకొట్టింది. దీంతో సుబ్బారావు, రామకృష్ణలకు తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరినీ తుని ఏరియా ఆసుపత్రికి తరలించగా సుబ్బారావు మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. రామకృష్ణ చికిత్స పొందుతున్నాడు. మృతుడి కుమారుడు రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తొండంగి పోలీసులు తెలిపారు.

పెద్దిపాలెంలో భారీ అగ్నిప్రమాదం

- మూడు తాటాకిళ్లు అగ్నికి ఆహుతి
- రూ.10 లక్షల ఆస్తినష్టం
- డాబా ఇల్లు పాక్షికంగా దగ్ధం



అగ్నిప్రమాదంలో దగ్ధమవుతున్న గృహాలు

ప్రత్తిపాడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెంలో శనివారం తెల్లవారుజామున జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో 3 తాటాకిళ్లు పూర్తిగా దగ్ధం కాగా ఒక డాబా ఇల్లు పాక్షికంగా దెబ్బతింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.10 లక్షల ఆస్తినష్టం వాటిల్లింది. ఆరు కుటుంబాల వారు నిరాశ్రయులయ్యారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పెద్దిపాలెంలోని రాళ్ల అప్పారావు, రాళ్ల రాజు, రాళ్ల ఆనందరావులకు చెందిన తాటాకిళ్లకు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించి కాలి బూడిదయ్యాయి. ఈ ఘటనలో గ్యాస్ సిలిండర్ పేలడంతో సమీపంలో ఉన్న పిల్లి సూరిబాబు డాబా ఇల్లు పాక్షికంగా దెబ్బతింది.స్థానికుల సమాచారంతో ఎస్ఐ ఎస్.లక్ష్మీకాంతం అగ్నిమాపక సిబ్బందికి విషయం తెలియజేశారు. దీంతో ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. ఈ ఘటనతో నాలుగు కుటుంబాలతో పాటు గుండు బుజ్జమ్మ, బొందలపు కాసులమ్మ కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. ఇళ్లలోని బట్టలు,గృహోపకరణాలు, బైక్ కాలిబూడిదయ్యాయి. ప్రమాదంలో రూ.10 లక్షలు పైబడి ఆస్తినష్టం జరిగిందని బాధితులు తెలిపారు. కట్టుబట్టలతో మిగిలారు.బాధితులను ఎమ్మెల్యే సత్యప్రభ పరామర్శించి బియ్యం, దుస్తులు, కొంత ఆర్థిక సాయం అందజేశారు. జనసేన నాయకురాలు బార్లపూడి క్రాంతి బాధిత కుటుంబానికి రూ.40 వేలు సాయం అందించారు. ఆమె వెంట జనసేన నాయకులు సూర్నీడి సురేష్, నల్లల రామకృష్ణ, దంతులూరి బోసురాజు తదితరులున్నారు. అలాగే సాయంత్రం నియోజకవర్గ వైసీపీ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు బాధితులను పరామర్శించి ఆర్థిక సాయం, నిత్యావసర సరుకులు అందించారు. అందజేశారు.



ప్రమాదంలో దగ్ధమైన ఇల్లు

వాహనం ఢీకొని వృద్ధుడి మృతి



మృతుడు చంద్రరావు

కరప, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒక వృద్ధుడు మృతిచెందినట్టు కరప పోలీసులు తెలిపారు. కాకినాడ రూరల్ మండలం పగడాలపేట గ్రామానికి చెందిన చోడిపల్లి చంద్రరావు(72) చేపల వేట సాగిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. శుక్రవారం రాత్రి ఇంటి నుంచి చొల్లంగి బ్రిడ్జి వైపుకు వెళ్తుండగా ఉప్పలంక సరళ రైస్ మిల్లు ఎదుట గుర్తుతెలియని వాహనం ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన చంద్రరావును అంబులెన్స్‌పై కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై మృతుడి కోడలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు కరప ఏఎస్ఐ సూరిబాబు తెలిపారు.

రాష్ట్ర థాంగ్టా పోటీలకు విద్యార్థినుల ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

బిక్కవోలు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ థాంగ్టా రాష్ట్ర స్థాయి పోటీలకు పందలపాక ఉన్నత పాఠశాల నుంచి నలుగురు విద్యార్థినిలు ఎంపికయ్యారని హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి శనివారం తెలిపారు. అండర్-17 విభాగంలో జి.తేజసాయిశ్రీ, అండర్-19 విభాగంలో పి.గీతారమ్యశ్రీ, బి.సత్య ప్రసన్న, జి.క్రాంతి ఎంపికయ్యారన్నారు. వీరు ఈ నెల 7, 8 తేదీల్లో అనకాపల్లి జిల్లా పరవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. మార్షల్ ఆర్ట్స్ విభాగానికి చెందిన థాంగ్టా క్రీడకు ఎంపికైన విద్యార్థినులను, శిక్షణ ఇచ్చిన పీడీ యువరాజారెడ్డిని హెచ్‌ఎంతో పాటు ఎస్‌డీసీ చైర్మన్ కోనాల సత్తిరాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

శృంగారవల్లభుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుపతి శృంగారవల్లభ స్వామిని అధిక సంఖ్యలో భక్తులు శనివారం దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచే స్వామి దర్శనానికి బారులు తీరారు.ప్రత్యేక దర్శన టికెట్ల విక్రయం ద్వారా రూ.1,34,140, అన్నదాన విరాళాలు రూ.64,141, కేశఖండన ద్వారా రూ.5,640, తులాభారం రూ.500, లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.17,595 వెరసి రూ.2,22,016 ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.ఆలయానికి వచ్చే భక్తులకు పులిహోర, అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. సుమారు 10 వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారన్నారు.

పశువులను కడుగుతుండగా ఫిట్స్..

కాలువలో పడి వ్యక్తి మృతి



మృతుడు సింహాచలం

ప్రత్తిపాడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పశువులను కాలువలో కడుగుతుండగా ఫిట్స్ రావడంతో ఒక వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు.. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి గ్రామం దళితవాడకు చెందిన దొండపాటి సింహాచలం(42) శనివారం సాయంత్రం 5గంటల సమయంలో పశువులను రాచపల్లి అడ్డురోడ్డు వద్ద పుష్కర కాలువలోకి మళ్లించాడు. వాటిని కడుతుండగా సింహాచలానికి మూర్ఛ రావడంతో నీటిలో పడిపోయాడు. మునిగిపోయి కొట్టుకోవడాన్ని సమీపంలోని కూలీలు గమనించి ఒడ్డుకు తీసుకువచ్చి సపర్యలు చేశారు. ప్రత్తిపాడు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. సింహాచలం మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి

జీజీహెచ్‌లో కార్డియాలజిస్ట్ నియామకానికి కృషి

ఆసుపత్రి పరిశీలనలో మంత్రి సుభాష్



కాకినాడ జీజీహెచ్‌ను పరిశీలిస్తున్న మంత్రి సుభాష్

జీజీహెచ్(కాకినాడ), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌కు హృద్రోగుల తాకిడి అధికంగా ఉన్న నేపథ్యంలో పూర్తిస్థాయి కార్డియాలజిస్ట్ నియామకానికి కృషి చేస్తానని రాష్ట్ర కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. ఆయన శనివారం జీజీహెచ్‌లో సందర్శించి కార్డియాలజీ, జనరల్ సర్జరీ వార్డుల్లో చికిత్స పొందుతున్న పలువురిని పరామర్శించి వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రి నిర్వహణపై సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారిని అడిగి తెలుసుకున్నారు.ఆసుపత్రిలో వైద్య సిబ్బంది కొరత ఉందని ముఖ్యంగా గుండె వైద్య నిపుణులు లేక రోగులు ఇబ్బంది ప డుతున్నట్టు మంత్రి దృష్టికి తీసుకు రాగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి కార్డియాలజిస్ట్ నియామకానికి కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మనాభన్ శ్రీనివాసన్, సీఎస్ఆర్ ఎంవో డాక్టర్ కోమలి, అడ్మినిస్ట్రేటర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

విధులకు సకాలంలో హాజరవ్వాలి

సింగంపల్లి పీహెచ్‌సీ తనిఖీలో సిబ్బందితో డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు


రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

రంగంపేట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య కేంద్రానికి సిబ్బంది సకాలంలో హాజరు కావాలని, నిర్లక్ష్యం చూపిన వారిపై చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు హెచ్చరించారు. శనివారం మండలంలోని సింగంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సమ్మికుమార్, డాక్టర్ నిశాంత్ బుర్రిరాజులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిబ్బంది సకాలంలో బయోమెట్రిక్ అటెండెన్స్ తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. హాజరు పట్టీలను, వైద్య సేవల రికార్డులను తనిఖీ చేశారు. రోగులకు సమయానికి వైద్య సేవలందించేలా ప్రతిఒక్కరూ పనిచేయాలని ఆదేశించారు. అనంతరం పీహెచ్‌సీ వద్ద కొత్తగా నిర్మిస్తున్న భవనాలు పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ సంకీర్తన, సిబ్బంది పాల్గొన్నారు.

బిక్కవోలు షష్ఠి ఉత్సవాల

ఆదాయం రూ.3.45 లక్షలు

బిక్కవోలు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): బిక్కవోలులోని కుమార సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి ఉత్సవ ఆదాయం రూ.3,45,947 వచ్చిందని ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్ తెలిపారు. శనివారం గోలింగేశ్వరస్వామి ఆలయంలోని హుండీలను దేవదాయశాఖ తనిఖీ అధికారి ఆర్.బాలాజీరామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది లెక్కించారు. గత నెల 25 నుంచి డిసెంబరు 6వరకూ హుండీలను లెక్కించినట్టు తెలిపారు.

ఏపీ ఎన్జీవో అనపర్తి అధ్యక్షుడిగా శ్రీనివాసులు


ఏపీ ఎన్జీవో అనపర్తి నూతన కార్యవర్గంతో రాష్ట్ర, జిల్లా నాయకులు

అనపర్తి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీవో అనపర్తి శాఖ అధ్యక్షుడిగా వి.శ్రీనివాసులు ఎన్నికయ్యారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిడదవోలు యూనిట్ అధ్యక్షుడు కె.నందీశ్వరుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రతి పదవికి ఒక్కొక్క నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో కమిటీ ఏకగ్రీవమైనట్టు ఎన్నికల అధికారి నందీశ్వరుడు ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా కె.వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా చంద్రదీప్, కోశాధికారిగా సందీప్‌కుమార్,ఉపాధ్యక్షులుగా మంగరాజు, రమాకాంత్‌రెడ్డి, గంగాధరరావు, సంయుక్త కార్యదర్శులుగా నవీన్‌కుమార్, చైతన్య తరుణ్, మహిళా కార్యదర్శిగా కె.దుర్గాభవాని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. అనంతరం నూతన కార్యవర్గంతో ప్రమాణం చేయించారు. జిల్లా అధ్యక్షుడు మీసాల మాధవరావు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ అనిల్‌కుమార్,ప్రవీణ్‌కుమార్, వేణుమాధవరావు, విజయ్‌కృష్ణ, ధర్మేంద్ర పాల్గొన్నారు.

నేటి నుంచి దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవాలు


దుర్గాదేవి అమ్మవారు

కడియం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): వీరవరం గ్రామం కొలువైన దుర్గాదేవి ఆలయ 41వ వార్షికోత్సవం తీర్థం ఆదివారం నుంచి 10వ తేదీ వరకు జరగనుంది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో.. భక్తులు లైనులో వచ్చే విధంగా ఏర్పాట్లు, భారీ విద్యుత్ అలంకరణ చేశారు. మొదటి రెండు రోజులు భక్తుల రద్దీ నేపథ్యంలో కడియం పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. భారీ ఏర్పాట్లు చేశారు. గ్రామ దేవత వార్షికోత్సవం సందర్భంగా గ్రామస్థులు తమ ఆడపడుచులను ఆహ్వానించారు.

తెలుగు భాష ఔన్నత్యాన్ని తెలుసుకోవాలి

భారతీయ భాష వారోత్సవాలు

రంగంపేట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తెలుగు భాష ఔన్నత్యాన్ని విద్యార్థులందరూ తప్పనిసరిగా తెలుసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి సూచించారు. శనివారం రంగంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో భారతీయ భాషా ఉత్సవం వారోత్సవాల సభకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. తెలుగు పద్యాలు, సూక్తులపై బాల్యం నుంచి అవగాహన పెంచుకొని ఆచరించాలన్నారు. వారం రోజులపాటు నిర్వహించే కార్యక్రమాలను తెలుగు ఉపాధ్యాయురాలు పేరమాంబ వివరించారు. కార్యక్రమంలో ఆంగ్ల, హిందీ ఉపాధ్యాయులు వీసీ జాకబ్, పుష్పలతవిజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

అన్ని భాషలను గౌరవించాలి

అనపర్తి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భాష వేరైనా భావం ఒక్కటేనని, అన్ని భాషలను గౌరవించాలని ప్రధానోపాధ్యాయురాలు సీతా మహాలక్ష్మి అన్నారు. భారతీయ భాషా దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా పులుగుర్త జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు శతక పద్యాలపై పోటీలు నిర్వహించారు. విజేతలకు శనివారం బహుమతులు ప్రదానం చేశారు. ఈనెల 11న మహాకవి సుబ్రహ్మణ్య భారతి జయంతి సందర్భంగా ఈ పోటీలు నిర్వహించామని హెచ్ఎం పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దాతల ఆశయాలను నెరవేర్చాలి

జీవ కారుణ్య సంఘం పాలకవర్గ ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గౌతమి జీవకారుణ్య సంఘం ఆస్తులను పరిరక్షించడంతో పాటు దాతల ఆశయాలు నెరవేర్చాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు సూచించారు. శనివారం వృద్ధాశ్రమంలో జరిగిన గౌతమి జీవ కారుణ్య సంఘం పాలకవర్గం ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. కూటమిలో టీడీపీ, జనసేన, బీజేపీ వారికి సమన్యాయం పాటిస్తూ పాలక మండలిని నియమించామన్నారు.మంగళగిరి నియోజకవర్గం తర్వాత రాజమండ్రి సిటీకే ఎక్కువ కార్పొరేషన్, డైరెక్టరు పదవులు సాధించామన్నారు. ఉనికి కోల్పోతున్న వైసీపీ కోటి సంతకాల సేకరణకు కిరాయి మనుషులను తెచ్చుకుంటోందని విమర్శించారు. చైర్మన్ వర్రే శ్రీనివాసరావు మాట్లాడుతూ సంఘ పురోభివృద్ధికి కృషి చేస్తామన్నారు.టీడీపీ నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, కుడుపూడి సత్తిబాబు, కాశి నవీన్‌కుమార్, నక్కా చిట్టిబాబు,మరుకుర్తి రవియాదవ్, వైశ్రీను, బుడ్డిగ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దివాన్‌చెరువులో చెత్త సేకరణకు ట్రాక్టర్లను పెంచాలి

దివాన్‌చెరువు, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి) : దివాన్‌చెరువు పంచాయితీలో చెత్తసేకరణకు ప్రస్తుతం ఉన్న ట్రాక్టర్లను ఐదుకు పెంచడంతోబాటు మరో ఐదు రిక్షాలు కుడా సమకూర్చాలని దివాన్‌చెరువుకు చెందిన సామాజిక కార్యకర్త ఎస్.డేవిడ్ రాజు కోరారు. ఈ మేరకు పంచాయతీ ప్రత్యేకాధికారి, రాజమహేంద్రవరం మునిసిపల్ కమిషనర్‌ను శనివారం కలిసినట్టు స్థానిక విలేకరులకు ఆయన తెలిపారు. గ్రామంలో చెత్తసేకరణకు గతంలో ఐదు ట్రాక్టర్లు ఉండేవని అందులో మూడు 10 నెలలుగా మరమ్మతులకు గురయ్యాయని చెప్పారు. రెండు ట్రాక్టర్లతోనే చెత్త సేకరిస్తుండడంతో పారిశుధ్యం సక్రమంగా సాగడంలేదన్నారు. గ్రామంలో మెరుగైన పారిశుధ్యం కోసం చెత్త సేకరించే ట్రాక్టర్లను పెంచాలని, ఐదు రిక్షాలు కుడా సమకూర్చాలని కోరారు. తన విజ్ఞప్తిపై కమిషనర్ సానుకూలంగా స్పందించారని డేవిడ్ అన్నారు.

ఆదర్శ కళాశాల వార్షికోత్సవం



వేడుకల్లో పాల్గొన్న కళాశాల నిర్వాహకులు, విద్యార్థులు

గోకవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి ఆదర్శ ఫార్మసీ కళాశాలలో ఫ్రెషర్స్ డే, వార్షికోత్సవం శనివారం జరిగాయి. చిత్తూరు గ్రూప్ ఆఫ్ కంపెనీ చైర్మన్ చిట్టూరి శివరామకృష్ణ ముఖ్య అతిథిగా విచ్చేశారు. కళాశాల చైర్మన్ పి.కనకరాజు మాట్లాడుతూ తమ కళాశాలలో అన్ని రకాల మౌలిక వసతులు ఉన్నాయన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.ఈ సందర్భంగా ఆదర్శ పాఠశాల్లో జరుగుతున్న విజ్ఞాన ప్రదర్శనను శివరామకృష్ణ తదితర ప్రముఖులు సందర్శించారు. కళాశాల సెక్రటరీ పి.నాగమణి, ప్రిన్సిపాల్ త్రినాధ్ రావు, కోఆర్డినేటర్ పి.శ్రీనివాస్, డైరెక్టర్‌లు ప్రవల్లిక, హరిక, అధ్యాపకులు పాల్గొన్నారు.


అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రాజమండ్రి బార్ అసోసియేషన్

రాజ్యాంగం.. దిక్సూచి

- అంబేద్కర్ స్ఫూర్తి ప్రదాత
- నన్నయ వీసీ ప్రసన్నశ్రీ
- పలుచోట్ల బాబాసాహెబ్ వర్ధంతి
- నాయకులు, అధికారుల నివాళి


నన్నయ వర్సిటీలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): వివిధ మతాలు, జాతులు ఉన్న భారత దేశానికి అంబేద్కర్ రచించిన రాజ్యాంగం దిక్సూచిగా నిలిచిందని చెప్పారు. అటువంటి మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ 69వ వర్ధంతిని శనివారం పలు చోట్ల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని గ్రంథాలయం వద్ద అంబేద్కర్ విగ్రహానికి ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంబేద్కర్ అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాటం చేశారని, ఆయన పోరాట ఫలితంగానే నేడు అంటరానితనం సమాజం నుంచి క్రమంగా దూరమవుతూ వచ్చిందన్నారు. విద్యాభ్యాస సమయంలో తాను ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తు చేసుకుంటూ నేటితరం విద్యార్థులు ఇటువంటి ఇబ్బందులు లేకుండా చక్కని వాతావరణంలో విద్యను అభ్యసిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్, డీన్స్ అధికారులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజానగరం: రాజ్యాంగ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మండలంలోని తోకాడ, రాజానగరం, సూర్యారావుపేట, పల్లకడియం, మల్లంపూడి,తూర్పుగోనగూడెం తదితర గ్రామాల్లో అంబే ద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తోకాడలో ఏర్పాటు చేసిన సంస్మరణ సభల్లో రాజ్యాంగ పరిరక్షణ సమితి కన్వీనర్ మేకల లక్ష్మీపతిరావు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తన జీవితాన్ని ధారపోసి అనేక అసమానతలతో సతమతమవుతున్న దేశ ప్రజలకు మానవ హక్కులు కల్పించిన మహనీయుడని కొనియాడారు. ప్రపంచంలోనే అత్యుత్తమ దృఢమైన రాజ్యాంగాన్ని అందించి, దేశాభివృద్ధికి దోహదపడ్డారని గుర్తు చేసుకున్నారు. రాజ్యాంగంపై అవగాహనకు తమ సమితి సభ్యులు రాజ్యాంగ పరిరక్షణ యాత్రలు చేస్తున్నామన్నారు.కార్యక్రమంలో మేకల ఏసురత్నం, మాస్టారు సాహెబ్, మేకల శ్రీను, కవల ప్రశాంత్, చిన వీర్రాజు, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: రాజమండ్రి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అసోసియేషన్ హాల్‌లో జనరల్ సెక్రటరీ పెల్లూ రి రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి బార్ అధ్యక్షుడు శోభనాద్రి శాస్త్రి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ అల్లంపల్లి రామకృష్ణ, మల్కా శ్రీనివాస్, సుమన్‌పాల్, టి.పాండురంగారావు, దివాకర్, ఎన్.శ్రీనివాస్, కె.ఆనంద్‌కుమార్, ధర్నాలకోట వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గోకవరం: గోకవరంలోని సంజీవయ్యనగర్‌లో ఉన్న అంబేద్కర్ కమ్యూనిటీ హాల్లో విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతిఒక్కరూ అంబేద్కర్ అడుగుజాడల్లో నడవాలన్నారు. బడుగు బలహీన వర్గాల కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంఎస్పీ మండలాధ్యక్షుడు గరబారపు శ్రీనివాస్, చాపల సూరిబాబు, బొడ్డపాటి వీరచంద్రం, చింతాటి వెంకన్న, సవరపు ఏసురత్నం, కొమ్ము శేఖర్, అరసాల బాపిరాజు, మోర్త సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: బలభద్రపురంలో అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మార్పీస్, కూటమి నాయకులు పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ బుంగా రామారావు, సొసైటీ అధ్యక్షుడు ఎన్‌వీ సుబ్బారెడ్డి, దత్తుడు సుబ్బారెడ్డి, మల్లిడి సుబ్బారెడ్డి, అయ్యప్ప, కొర్నాల సూరిబాబు, ఎమ్మార్పీస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.బిక్కవోలు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో వి.శ్రీనివాస్, ఏవో నాగేంద్రప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవోలు జాన్‌మిల్టన్,మునేశ్వరరావు, సిబ్బంది అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కడియం: మండలంలోని పొట్టిలంక గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం, జై భీమ్ యూత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి నక్కా వెంకటరత్నంరాజు విచ్చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో న్యాయవాది బడుగు సత్తిబాబు, నక్కా చంటిబాబు, కప్పల భాస్కరరావు, నాంబత్తుల సత్తిపండు, బడుగు శ్రీను పాల్గొన్నారు. బుర్రిలంక గోకుల్ నర్సరీలో జరిగిన కార్యక్రమానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం న్యాయవిభాగం ఉపాధ్యక్షుడు డీవీవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో నూనె వెంకటేశ్వరరావు, తానంకి ఏసురత్నం, కాముల వెంకటకృష్ణ, మలసాని సుబ్బరాజు పాల్గొన్నారు. కాగా మాజీ సీఎం జగన్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ నిజాయితీ గల ఐఏఎస్, ఐపీఎస్‌లకు చెందిన బీసీ అధికారులైన పి.కృష్ణయ్య, జె.గోపీనాథ్‌లను అవమానకరంగా మాట్లాడడాన్ని వారు తీవ్రంగా ఖండించారు.

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక గోకవరం బస్టాండ్ వద్ద జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ముఖ్యఅతిథిగా విచ్చేసి అం బేద్కర్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. అంబేద్కర్‌ను ప్రతిఒక్కరూ స్మరించుకోవాలని, ఆయన ఆశయాలు భవిష్యత్ తరాలకు తీసుకెళ్లి దేశాన్ని ప్రపంచంలోనే అగ్రరాజ్యంగా నిలపాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, శెట్టిబలిజ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, మజ్జి రాంబాబు, శెట్టి జగదీష్, మొకమాటి సత్యనారాయణ, కోసూరి చండీప్రియ, కప్పల వెలుగుకుమారి, దాస్యం ప్రసాద్ పాల్గొన్నారు. ఇదే కార్యక్రమంలో మాజీ ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని అంబేద్కర్ చాలా ముందుచూపుతో రచించారన్నారు. సీపీఎం నాయకుడు అరుణ్ మాట్లాడుతూ రాజ్యాంగానికి బీజేపీ ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని విమర్శించారు. బీసీ,ఎస్సీఎస్టీ మైనార్టీ సంఘం వ్యవస్థాపకుడు సానబోయిన రామారావు, ఎల్‌వీ ప్రసాద్, బద్దే జార్జి అంటోని, దళిత గిరిజన నాయకులు పాల్గొని నివాళులర్పించారు.


అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రశాంత్‌కుమార్ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: మండలంలోని మల్లయ్యపేట సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి అంబేద్కర్ యువజన సంక్షేమ సంఘం నాయకుడు గుంటూరు ప్రశాంత్‌కుమార్, న్యాయవాది సాకా సురేష్‌బాబు నివాళులర్పించారు. అంబేద్కర్ ఆశయ సాధనకు అంబేద్కర్ యువజన సంక్షేమ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో మానుకొండ వెంకట్రావు,ఆచంట కళ్యాణ్, ఏబీ జనార్దన్‌రావు, చొప్పల భరత్, మోతా వీరాస్వామి, చెల్లుబోయిన రాంబాబు, జంగా రాజశేఖర్, టి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

అనపర్తి: మండలంలోని రామవరం, అనపర్తిలో జరిగిన కార్యక్రమాలకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి విచ్చేసి అంబేద్కర్‌కు నివాళులర్పించారు. దేశంలో అణగారిన ప్రజల కోసం పాటుపడిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు.కార్యక్రమాల్లో సర్పంచ్ గిరిడా గంగాభవాని, తమలంపూడి సుధాకరరెడ్డి, ఒంటిమి సూర్యప్రకాష్, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, మల్లిడి ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు. అనపర్తిలోని కెనాల్ రోడ్డులో అంబేద్కర్ విగ్రహానికి నల్లా చిన్నారావు, గారా తాతారావు తదితరులు పూలమాలలతో నివాళులర్పించారు.

రాజమహేంద్రవరం అర్బన్: స్థానిక రాజేంద్రనగర్‌లోని అంబేద్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ కార్యాలయంలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తాడేపల్లి విజయ్‌కుమార్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థి నాయకులు కడిమి జీవన్, వినయ్‌కుమార్, అజయ్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా రాజమహేంద్రి విద్యాసంస్థల చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి నాగార్జునసాగర్ డ్యామ్ పరిశీలనకు వెళ్లిన సందర్భంగా అక్కడున్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లే దేశాన్ని ప్రజాస్వామ్యబద్ధంగా పాలించుకుంటున్నామని అన్నారు.


రాజమహేంద్రవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసు


బలభద్రపురంలో నివాళులర్పిస్తున్నఎమ్మార్పీఎస్, కూటమి నాయకులు


అనపర్తిలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మనోజ్‌రెడ్డి

టీటీడీ గోశాలకు ఎండుగడ్డి తరలింపు


టీటీడీ గోశాలకు ఎండు గడ్డిని పంపుతున్న ఎమ్మెల్యే నెహ్రూ

గోకవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీనివాసుడి ఆశీస్సులు ఎల్లపుడూ రాష్ట్ర ప్రజలపై ఉండాలని జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు మెంబరు జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని తంటికొండ గ్రామం నుంచి తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన గోశాలకు శ్రీ శ్రీనివాస సేవా ట్రస్ట్, జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ సౌజన్యంతో ఆరు లారీల ఎండు గడ్డిని తరలించారు.లారీలను ఎమ్మెల్యే నెహ్రూ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే గోశాలకు ప్రథమంగా ఆరు లారీల గడ్డిని తరలించామన్నారు. రాబోయే రోజుల్లో మరో 50లారీల గడ్డిని తరలించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. గడ్డిని ఉచితంగా ఇచ్చేందుకు రైతాంగం,తరలించేందుకు లారీ యజమానులు సహకరించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో శ్రీ శ్రీనివాస సేవా ట్రస్ట్ చైర్మన్ నిమ్మకాయల సత్యనారాయణ,టీడీపీ మండలాధ్యక్షుడు పిల్లా చంటిబాబు, పాలూరి బోస్, అడపా భరత్, గల్లా రాము, గెడ్డం బాబు, బొట్టా రామకృష్ణ, బత్తుల సారంగధరుడు, ఎస్వీఎస్ అప్పలరాజు, మండిగ గంగాధర్ పాల్గొన్నారు.

దళితులు, పేదలకు అండగా ఉంటా: కంబాల


చీరలు అందుకున్న మహిళలతో కంబాల శ్రీనివాసరావు

గోకవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): దళితులు, పేదలకు తాను ఎల్లవేళలా ఉంటానని బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు అన్నారు.గోకవరంలోని పాత, కొత్త అంబేద్కర్ కాలనీల్లో క్రిస్మస్ వేడుకల్లో భాగంగా శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా కాలనీలకు చెందిన 600 మంది మహిళలకు శ్రీనివాసరావు చీరలను పంపిణీ చేశారు. అనంతరం అంబేద్కర్ వర్థంతి సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వరసాల ప్రసాద్, పెద్దాడ వెంకన్నదొర, దాసరి ధర్మరాజు, బత్తుల నానాజీ పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు నివాళి

దవళేశ్వరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్థంతి సందర్భంగా ఆయన విగ్రహాలకు పలువురు నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయంలో ఉపకులపతి ఆచార్య డి.మునిరత్నం నాయుడు ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్రం అనంతరం ఏర్పడిన మొదటి ప్రభుత్వంలో న్యాయశాఖా మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అంబేడ్కర్ సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా పోరాడారన్నారు. రాజ్యాంగ నిర్మాతగా, ఆర్థిక నిపుణుడిగా సేవలందించారన్నారు. కార్యక్రమంలో రాకా రమణ, డాక్టర్ కేవీ రామకృష్ణ, విశ్వవిద్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక బస్టాండ్ సెంటర్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి కూటమి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. లాక్ లైన్ సెంటర్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి మోర్త పావన మూర్తి ఆధ్వర్యంలో పూలమాలలతో నివాళులర్పించారు.

ఎస్టీయూ రాజానగరం అధ్యక్షుడిగా ధర్మరాజు

దివాన్‌చెరువు, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి) : రాజానగరం మండల ఎస్టీయూ శాఖ అధ్యక్షుడిగా బండి ధర్మరాజు రెండో పర్యాయం ఎంపికయ్యారు. దివాన్‌చెరువులో శనివారం జరిగిన సంఘ సమావేశంలో ధర్మరాజు ఎంపికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ఆర్.సుబ్రహ్మణ్యం, ఆర్థిక కార్యదర్శిగా ఎ.వీరబాబు, జిల్లా కౌన్సిలర్‌గా ఎస్‌జే త్రినాథబాబు ఎంపికయ్యారు. సంఘం మండల గౌరవాధ్యక్షుడిగా జి.వెంకటరెడ్డి ఏకగ్రీవంగా నియమితులయ్యారు.

నన్నయలో ముగిసిన అంతర్జాతీయ సదస్సు


అవార్డులు అందుకున్న పరిశోధక విద్యార్థులతో అతిథులు

దివాన్‌చెరువు, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): నూతన విషయాలు తెలుసుకొనేందుకు అంతర్జాతీయ సదస్సులు మంచి వేదికలని రిజిస్ట్రారు కేవీ స్వామి అన్నారు. ఆది కవి నన్నయ విశ్వవిద్యాలయంలో రసాయన శాస్త్ర విభాగం, హైదరాబాద్‌లోని అయోంకి పబ్లిష్కో రెండు రోజులుగా భౌతిక, రసాయన, జీవ శాస్త్రాల్లో నూతన ఆవిష్కరణలు: వ్యవసాయ- ఆహార సాంకేతికత, ఔషధ ఆవిష్కరణ పర్యావరణ స్థిరత్వంలో వాటి ఉపయోగాలు అనే అంశంపై జరిగిన అంతర్జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఈ సదస్సులో శాస్త్ర, సాంకేతిక అంశాలు వెలుగులోకి వచ్చాయన్నారు. రెండు రోజులపాటు జరిగిన ఈ సదస్సులో ఉత్తమ ప్రతిభ కనబరచిన పరిశోధక విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, అయోంకి పబ్లిష్కో చైర్మన్ ప్రొఫెసర్ చంద్రమౌళిపావులూరి, సదస్సు కన్వీనర్ బి.జగన్మోహనరెడ్డి, రసాయన విభాగాధిపతి కె.దీప్తి, ఐఎసీటీ శాస్త్రవేత్త కె.సురేష్‌బాబు, ఆరజన్ లాబ్స్ వైస్ ప్రెసిడెంట్ వి.కృష్ణారెడ్డి, వెస్ట్ ఫార్మాలో పర్యావరణ విభాగాధిపతి విజయసారధి, మైక్రోలాబ్స్ శాస్త్రవేత్త డీవీ సుబ్బారావు, పురలాబ్స్ డైరెక్టర్ ఆర్.అంజిబాబు పాల్గొన్నారు.

స్కూల్‌కు బీరువాలు, ప్రింటర్ అందజేత


పాఠశాలకు ఉపకరణాలు అందజేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక గౌతమి ఘాట్ రాజమండ్రి వర్తకులు స్వచ్ఛంద సేవా సంస్థ చాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్టు ఆధ్వర్యంలో రామదాసుపేట మునిసిపల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దడాల సుహాసినికి రూ.40 వేలు విలువైన 2 బీరువాలు, ప్రింటర్, 70 కంచాలు అందజేశారు.కార్యక్రమంలో కార్యదర్శి బాల నాగు బలేష్‌గుప్తా, యలమర్తి వెంకటేశ్వరరావు, మండవిల్లి వెంకటరాజు, లక్కోజు వీరభద్రరావు, సత్యవరపు గోపాలకృష్ణ, ఎస్.సీతారామంజనేయులు పాల్గొన్నారు.

రేపు ఎస్వీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

జిల్లా ఉపాధి అధికారి హరిశ్చంద్ర ప్రసాద్

నిడదవోలు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఉపాధి, నైపుణ్యాభివృద్ధి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10 గంటలకు నిడదవోలు ఎస్వీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె. హరిశ్చంద్ర ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రిన్సిపాల్ కె.జ్యోతి మాట్లాడుతూ సోమవారం నిర్వహిస్తున్న జాబ్‌మేళాను అర్హత ఉన్న నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కిసాన్ మార్ట్ క్రెడ్ ఆక్సిస్ గ్రామీణ, ఆపాక్ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఎస్‌బిఐ కర్ష్, ఆర్‌బీఎల్ కర్ష్ తదితర సంస్థలు పాల్గొంటు న్నాయని, ఇవి పలు ఖాళీల భర్తీకి నేరుగా ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 12 తరగతి, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బి.టెక్ చదివినవారు లేదా అనుభవం ఉన్నవారు, 19 నుంచి 30 సంవత్సరాల వయస్సు కలిగిన నిరుద్యోగులు పాల్గొనవచ్చని తెలిపారు. ఎంపికైన వారికి తక్షణమే ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తామని చెప్పారు. జాబ్‌మేళాకు హాజరు అయ్యేవారు ముందుగానే నైపుణ్యం పోర్టల్‌లో వారి పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వీడీజీ మురళి సూచించారు. హాజరయ్యే అభ్యర్థులు బయోడేటా, ఆధార్ కార్డు, విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు వెంట తెచ్చుకోవాలని సూచించారు.మరిన్ని వివరాలకు 9533221189 నెంబర్‌ను సంప్రదించాలని అధికారులు సూచించారు.


ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

ఆదివారం 7 డిసెంబరు 2025 | 5







నరుడు.. వానరుడు!

అడవుల్లో ఉండాల్సిన వానరమూక జనారణ్యంలోకి ఎందుకొస్తుంది..? ఇది సమాధానంలేని ప్రశ్న.. ఒకనాడు వానరమూకను చూడాలంటే అటవీ ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది.. మరిప్పుడో జనారణ్యాన్నే అడవులుగా మార్చుకుంటున్నాయి.. ఇష్టానుసారం ప్రవర్తిస్తున్నాయి.. కోతి చేష్టలతో జనాలను ఇబ్బంది పెడుతున్నాయి..పై చిత్రంలోనే వానరమూకను చూడండి.. ఒక గోడ ఎక్కడానికి ఎంత హడావుడి చేస్తున్నాయో. అటు పంటలను నాశనం చేస్తున్నాయి.. ఇటు ఇళ్లపై దాడులు చేస్తున్నాయి.. తట్టుకోలేని జనం బాబోయ్ వా..నరకం భరించలేకపోతున్నాం.. అడవులకు తరలించాలని వేడుకుంటున్నారు.. వానరాలు అడవులను వదిలి జనారణ్యంలోకి ఎందుకొస్తున్నాయనే దానిపై అటవీ అధికారులు దృష్టిపెట్టాలి.. - కొవ్వూరు

స్క్రబ్ టైఫస్ కేసుల్లేవ్

డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలో ఇప్పటి వరకూ స్క్రబ్ టైఫస్ కేసులు నమోదు కాలేదని డీఎం హెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు.. అప్రమత్తంగా ఉన్నాం.. మందులు సిద్ధంగా ఉన్నాయి. జిల్లాలో అన్ని ఆసుపత్రుల్లో మలేరియా పరీక్షల నిమిత్తం 4,29,911 మందికి రక్తపరీక్షలు నిర్వహించగా ఎలాంటి పాజిటివ్ మలేరియా కేసులు నమోదు కాలేదు. 2,872 మందికి డెంగీ పరీక్షలు చేయగా 32 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. చికున్ గున్యా కేసులు కూడా నమోదు కాలేదు. జీజీహెచ్‌లో స్క్రబ్ టైఫస్ నిర్ధారణ కోసం 20 ర్యాపిడ్ టెస్టింగ్ కిట్లు అందుబాటులో ఉంచామన్నారు..



అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం నన్నయ వర్శిటీలో విగ్రహానికి వీసీ ప్రసన్నశ్రీ, సిబ్బంది పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. - వివరాలు 8లో

ఆమె లేని రంగమేదైనా ఉందా... అందుగలదు.. ఇందులేదని సందేహం వలదు..ఎందెందు వెదికినా ఆమె గలదు.. ఎందుకంటే.. ఏ రంగమైనా మేం సైతం అంటున్నారు.. కూటమి సర్కారు కూడా స్త్రీశక్తికి జైకొడుతోంది.. మహిళల ఆర్థిక స్వావలంభనకు తన వంతు అండగా నిలుస్తోంది.. ఎదుగుదలను ప్రోత్సహిస్తోంది.. గతంలో కాకినాడ, రాజమహేంద్రవరంలో 50 మంది మహిళలకు సబ్సిడీపై రాపిడో ఈ బైక్‌లను ప్రోత్సహించింది.. ఆదరణ బాగుండడంతో ఏకంగా 255 బైక్‌లను రంగంలోకి దించేందుకు సమాయత్తమవుతోంది.. మహిళలు భలేభలే అంటూ ఉత్సాహం చూపుతున్నారు.

అభలే!

మహిళా రాపిడోలు..రయ్‌రయ్



- ఉమ్మడి జిల్లాలో మహిళలకు ఛాన్స్
- త్వరలో మెప్మా ఆధ్వర్యంలో ఎంపిక
- కాకినాడ జిల్లాలో 230
- రాజమహేంద్రవరంలో 25 మంది
- సబ్సిడీపై ఈబైక్‌లు అందజేత
- గతంలో మహిళా రైడర్లకు ఆదరణ

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

మహిళలు ఆర్థిక స్వావలంభన సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మెప్మా ద్వారా రాపిడో ఈ బైక్‌లు ఇచ్చి ప్రోత్సహిస్తోంది.ప్రస్తుతం కాకినాడ, రాజమహేంద్రవరం నగరాల్లో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన మహిళా రాపిడో ఈ వాహనాలకు ఆదరణ బాగుండడంతో కొత్తగా మరింత మందికి అవకాశం ఇవ్వాలని నిర్ణయించింది. కాకినాడ జిల్లాలో 230 మంది, రాజమహేంద్రవరంలో మరో 25 మందిని ఎంపిక చేయడానికి కసరత్తు ప్రారంభించింది.మరోపక్క డ్వాక్రా గ్రూపుల్లో మహిళలు రాపిడో ద్వారా బైక్‌లు నడపడానికి ముందుకు వస్తే ఆ సంస్థకు తొలి మూడు నెలలు ప్లాట్‌ఫాం ఛార్జీలు చెల్లించక్కర్లేకుండా ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది.ఆ తర్వాత నుంచి నెలకు వెయ్యి చెల్లించాల్సి ఉండగా ఒక్కో వాహనానికి నెలకు 300 బుకింగ్‌లు రాపిడో ఇవ్వనుంది.



మహిళలకు ఈ బైక్‌లు ఇస్తున్న కాకినాడ జిల్లా ఇన్‌చార్జి మంత్రి నారాయణ(ఫైల్)

రాబడి రయ్..రయ్...

మహిళలు ఆర్థికంగా ఎదిగేలా చేసేందుకు రాష్ట్రప్రభుత్వం రాపిడో సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. జిల్లాల్లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ద్వారా స్వయం సహాయక బృందాల్లోని సభ్యులను ఎంపిక చేసి వారికి ఎలక్ట్రికల్ బైక్‌లు అందిస్తోంది. దీంతో వీరు నిత్యం రాపిడో ద్వారా ప్రయాణీకులను వారి గమ్య స్థానాలకు బైక్‌లపై చేర్చి నెలనెలా కొంత ఆదాయం సంపాదించుకునేలా చేయాలని లక్ష్యం పెట్టుకుంది.మహిళలు సురక్షితంగా తమ ప్రాంతాలకు వెళ్లడానికి రాపిడో ద్వారా మహిళలే వస్తే వారికి స్వయం ఉపాధి లభించినట్లవు తుందని ప్రభుత్వం భావించింది. అందులో భాగంగా ఈ ఏడాది జూన్ నుంచి పథకాన్ని పట్టాలెక్కించింది. పైలట్ ప్రాజెక్టు కింద తొలుత కాకినాడ, రాజమహేంద్రవరం నగరాల్లో చెరో 25 మంది మహిళలను ఎంపిక చేసింది. వీరంతా స్థానికంగా ఉన్న డ్వాక్రా గ్రూపు మహిళలే. వీరికి బ్యాంకు ద్వారా ఎలక్ట్రిక్ బైక్‌కు రుణం ఇప్పించింది. అటు ప్రభుత్వం తరఫున రూ.15 వేల వరకు సబ్సిడీ అందించింది. ఇప్పుడు ఈ మహిళంతా రాపిడో ద్వారా ఈ బైక్‌లతో ఎంచక్కా తిరుగుతున్నారు.ఒక్కో రాపిడో మహిళా బైక్ రైడర్‌కు నెలకు రూ.18 వేల నుంచి రూ.22 వేల వరకు ఆదాయం లభిస్తోంది.రైడ్‌లకు వెళితే రోజుకు రూ.800 నుంచి రూ.వెయ్యి వరకు ఆదాయం సంపాదిస్తున్నారు.

కాకినాడలో..

కాకినాడ నగరంలో మెప్మా ద్వారా ఎంపిక చేసిన మహిళలకు రాపిడో ద్వారా ఆదాయం బాగుండ డంతో మరింత మంది మహిళలను ఎంపిక చేయడానికి అధికారులు సన్నా హాలు చేస్తున్నారు. త్వరలో మరో 75 మందిని రాపిడోతో అనుసంధానించబోతున్నారు. కాకినాడలో ఆదరణ బాగుండడంతో మొత్తం వంద మందిని ఎంపిక చేయాలని మెప్మా లక్ష్యం విధించుకుంది.పిఠాపురం మునిసిపాలిటీ పరిధిలో 25, సామర్లకోట 30, పెద్దాపు రం 25, గొల్లప్రోలు 25, తుని 25, ఏలేశ్వరంలో 25 మంది చొప్పున మొత్తం జిల్లాలో కాకినాడ కార్పొరేషన్, మిగిలిన మునిసిపాలిటీలు, నగర పంచాయతీలు కలిపి త్వరలో 255 మందిని ఎంపిక చేయనున్నారు. తద్వారా ఎలక్ట్రిక్ బైక్‌లు కొనుగోలుకు రూ.5.28 కోట్ల వరకు వ్యయం అవుతుందని అంచనా వేశారు. డ్వాక్రా గ్రూపు సభ్యుల్లో ఒకరు లేదా వారి కుటుంబ సభ్యుల్లో ఆసక్తి కలిగిన వారిని అధికారులు ఎంపిక చేస్తున్నారు.

రాజమహేంద్రవరంలో 25

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరంలో ఇప్పటికే 25మంది రైడర్లు ఉండగా, మరో 25 మందిని ఎంపిక చేయ డానికి కసరత్తు మొదలుపెట్టారు. తొలుత ప్రయోగాత్మకంగా ఎంపిక చేసిన 25 మందిలో కొందరి ఈ బైక్‌లు విజయవాడ నుంచి రప్పించడంతో తరచూ మరమ్మతుకు గురవుతున్నట్టు అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో కొత్తగా ఎంపిక చేయనున్న మహిళా రైడర్లకు ఇకపై రాజమహేంద్రవరంలోనే ఎలక్ట్రిక్ బైక్‌లు అందించేలా ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకున్నారు.

మరి కొన్ని మునిసిపాలిటీలు

కొవ్వూరు, నిడదవోలు మున్సిపాల్టీలు, కోన సీమ జిల్లాలో అమలాపురం, మండపేట, రామ చంద్ర పురం మునిసిపాలిటీల్లోనూ ఈ సర్వీ సులు కొన సాగేలా అధికారులు ప్రయత్నం చేశారు. మెప్మా అధికారులు స్థానిక ప్రజా ప్రతి నిధులతో ను మాట్లాడారు. ప్రస్తుతం కొన్ని మునిసిపాలిటీల పరిధిలో డిమాండ్ లేదని, ఉన్న రూట్లలో త్వరలో బైక్‌లు లేదా ఎలక్ట్రికల్ ఆటోలు నడిపేలా మహిళలను ఎంపిక చేయాలని భావిస్తున్నారు.



ఉత్తమ హోంగార్డులతో ఎస్పీ నరసింహ కిశోర్, ఇతర అధికారులు

పోలీస్ శాఖలో

హోంగార్డులు అంతర్భాగం

హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవంలో ఎస్పీ నరసింహ కిశోర్

రాజమహేంద్రవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖలో హోంగార్డులు అంతర్భాగమని ఎస్పీ నరసింహ కిశోర్ పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయ పేరెడ్ గ్రౌండ్‌లో శనివారం నిర్వహించిన హోంగార్డుల 63వ వ్యవస్థాపక దినోత్సవానికి హాజరయ్యారు. మహిళా హోంగార్డులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఆర్ఐ (హోంగార్డ్స్) పరేడ్ నిర్వహించగా ఎస్పీ గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ హోం గార్డులు నిస్వార్థ సేవలందిస్తున్నారని ప్రశం సించారు.అత్యవసర పరిస్థితుల్లో సేవా దృక్పథంతో హోంగార్డులు విధులు నిర్వహి స్తున్నారన్నారు. వారి సేవలు కీలకమని స్పష్టం చేశారు. విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన హోం గార్డులు బీఎస్ఎస్ ఉపేంద్ర(434), పి.వెంకట రమణ(810), వీజీ చౌదరి(353), జీఎస్ఎస్.ప్రకాశ్(932),జి.ప్రవీణ్ కుమార్(1250), వి.సుబ్రహ్మణ్యం(357)కు ఎస్పీ ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందజేశారు. ఉద్యోగ విరమణ పొందిన ఇద్దరు హోంగార్డులకు జిల్లా యూనిట్ హోంగార్డుల ఒక్కరోజు జీతాన్ని ఎస్పీ అంద జేశారు.కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు మురళీ కృష్ణ, సుబ్బరాజు, చెంచిరెడ్డి తదిత రులు పాల్గొన్నారు.



ఎస్పీ నరసింహ కిశోర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న హోంగార్డులు

ఏపీలో బీజేపీ బలపడదు : ఉండవల్లి 8

రేపటి నుంచి నన్నయలో పీజీ అడ్మిషన్లు

స్నేహితులను దింపడానికి వెళ్లి యువకుడు మృతి

- వివరాలు లోపల పేజీల్లో

రేపు యథావిధిగా పీజీఆర్ఎస్ : కలెక్టర్

రాజమహేంద్రవరం రూరల్ డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఈ నెల 8న జిల్లా,డివిజన్, మునిసిపల్, మండల గ్రామ, వార్డు స్థాయి కార్యాలయాల్లో మీకోసం -ప్రజా సమస్యల పరిష్కారవేదిక యథాతథంగా జరుగుతుందని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ఈ మేరకు శనివారం కలెక్టర్ ఒక ప్రకటన విడుదల చేశారు. అర్జీదారులు ముందుగానే ఆన్‌లైన్‌లో మీకోసం.ఏపీజీవోవీ.ఇన్‌ద్వారా నమోదు చేసుకోవచ్చన్నారు. అర్జీల స్థితిని తెలుసుకోవడానికి 1100 నెంబరు కాల్ చేసి వివరాలు పొందవచ్చని తెలిపారు. పౌరసేవలు మరింత మెరుగుపడేందుకు వాట్సాప్ గవర్నెన్స్ సెంటర్ 95523 00009 సేవలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

వేగంగా ధాన్యం కొనుగోళ్లు



మండలం	రైతులు	కొనుగోలు (టన్నులు)	విలువ (కోట్లలో)	చెల్లింపు (కోట్లలో)
నిడదవోలు	5347	37208.840	84.97	80.45
కొవ్వూరు	2524	23985.080	56.39	52.26
ఉండ్రాజవరం	2931	23136.440	53.02	45.74
బిక్కవోలు	4484	20163.560	44.63	40.17
తాళ్లపూడి	1496	17521.880	40.37	36.10
చాగల్లు	2445	17153.800	39.23	37.07
అనపర్తి	4115	15041.080	32.09	28.53
దేవరపల్లి	1097	14752.760	35.05	30.42
సీతానగరం	1651	13669.640	31.21	26.55
రాజానగరం	1589	12859.280	29.49	27.20
పెరవలి	1728	12728.160	28.92	25.82
నల్లజర్ల	1217	12440.240	28.81	27.42
కడియం	1470	10832.680	25.09	24.07
గోపాలపురం	986	10052.400	23.13	19.91
గోకవరం	929	9115.000	20.80	16.09
కోరుకొండ	731	7064.120	15.51	10.86
రంగంపేట	469	4401.520	10.14	08.55
రాజమండ్రి రూరల్	182	1296.680	02.94	02.87

రాజమహేంద్రవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): 2025-26 ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్ల వేగంగా సాగుతున్నాయని జేసీ వై.మేఘ స్వరూప్ వెల్లడించారు. ఇప్పటి వరకూ 35,391 మంది రైతుల నుంచి 2 లక్షల 63 వేల 423 టన్నుల సేకరణ జరిగిందన్నారు. వాటి విలువ రూ.601.79 కోట్లు కాగా రైతుల ఖాతాల్లో రూ.540.08 కోట్లు జమైందని చెప్పారు.



కట్టేస్తే.. కూల్చేస్తాం!

అక్రమ నిర్మాణాలపై కొరడా

- రాజమండ్రిలో 900లకు పైగా గుర్తింపు
- బీపీఎస్‌కి కేవలం 27 దరఖాస్తులు
- మోరంపూడిలో ఓ భవనం కూల్చివేత
- ఫిబ్రవరి నెలాఖరు వరకూ అవకాశం
- నోటీసులిచ్చిన అధికారులు
- కొవ్వూరు, నిడదవోలులో ఇంతే
- స్పందించకపోతే కూల్చివేత

(రాజమహేంద్రవరం/సిటీ - ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని నగరాలు, పట్టణాల్లో అనధికార నిర్మాణాలపై అధికార యంత్రాంగం కొరడా ఎత్తింది. ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీలోపు నిర్మించిన వాటిలో నిబంధనలు ధిక్కరించిన వాటికి బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్ (బీపీఎస్) ద్వారా క్రమబద్ధీకరించుకోవడానికి ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. ఈ మేరకు గత నెల 12వ తేదీన జీవో ఇచ్చింది. అప్పటి నుంచి 120 రోజుల్లోపు ఈ స్కీమ్‌ను వినియోగించుకోవాలి. ఇంత వరకూ తక్కువ మంది మాత్రమే స్పందించడంతో అధికార యంత్రాంగం చర్యలకు ఉపక్రమించింది. మోరంపూడిలో నిబంధనలు పాటించని భవనాన్ని గురువారం కూల్చి వేసింది. బీపీఎస్‌ను సద్వినియోగం చేసుకోకపోతే మిగిలిన భవనాల పరిస్థితి ఇంతేనని అధికారులు హెచ్చరిస్తున్నారు.

రాజమండ్రిలో 910 భవనాలు..

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థలో 910కి పైగా అనధికార కట్టడాలు ఉన్నట్టు గుర్తించారు. బీపీఎస్ స్కీమ్ కింద ఇంత వరకూ 26 మంది ఆన్‌లైన్ దరఖాస్తులు చేశారు. మిగిలినవారు స్పందించలేదు. కొవ్వూరు, నిడదవోలు మునిసిపాలిటీల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో అధికారులు అందరికీ నోటీసులు జారీ చేస్తున్నారు. వెంటనే బీపీఎస్ స్కీమ్ వినియోగించుకోవాలని హెచ్చరిస్తున్నా రు. ఫిబ్రవరి నెలాఖరులోపు మాత్రమే ఈ స్కీమ్ అమల్లో ఉంటుంది. ఈ అవకాశాన్ని వినియో గించుకోకపోతే..నిబంధనలు ప్రకారం కూల్చివేతలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు.

కమిషనర్ పట్టుదల..

అక్రమ కట్టడాలను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీపీఎస్ -2025 స్కీమ్ ను వినియోగించుకోకపోతే ఆయా భవనాలను కూల్చివేయడం తప్పదని కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ అధికారులు హెచ్చరిస్తున్నారు. గతంలో సుమారు 150 కట్టడాలకు నోటీసులు జారీ చేశారు. వాటిలో కొన్ని భవనాల యాజమాన్యాలు కోర్టులకు వెళ్లడం తో వాటిపై స్టే ఆర్డర్లు ఉన్నా యి. ఈ నిర్వాకం కూడా అప్పట్లో నగర పాలక సంస్థ అధికారులు పుణ్యమే. కూటమి ప్రభుత్వం బీపీఎస్‌ను తెరమీదకు తెచ్చి ఆయా అనుమతుల్లేని కట్టడాలను ఈ స్కీమ్‌లో క్రమబద్ధీకరించాలని గత 10 నెలలుగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే పెద్దగా స్పందన లేకపోవడంతో పరిస్థితి సీరియస్‌గా మారింది. ఇటీవల రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ బీపీఎస్, ఎల్ఆర్ఎస్ స్కీమ్‌లపై ప్రస్తావించారు.బీపీఎస్ స్కీమ్ వినియోగించుకోవడం ద్వారా భవనాలు క్రమబద్ధీకరించబడతాయి. ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. ఇప్పటికైనా అక్రమ కట్టడాలు చేసిన వారు బీపీఎస్‌ను వినియోగించుకోవాల్సి ఉంది. ఇప్పటికే కమిషనర్ రాహుల్ మీనా అక్రమ కట్టడాలపై చర్యలు చేపడుతున్నారు. బీపీఎస్ వినియోగించుకోకపోతే కూల్చివేతలు తప్పవు .

ప్లాన్ ధిక్కరిస్తే ఇంతే..

భవనాలు నిర్మించుకునే సమయంలో పలువురు ఒక ప్లాన్ ఇస్తారు. నిర్మించే సమయంలో స్థానిక నేతలు, కిందిస్థాయి ఉద్యోగుల సలహాతో తప్పులు చేస్తారు. మే హూనా అంటే అంతస్తులు..అంతస్తులు కట్టేస్తారు.. నిబంధనలు ధిక్కరిస్తారు. రాజమార్గంలో అధికారికంగా అనుమతులు పొంది భవనాలు నిర్మించుకుంటే సమస్యలురావు. బ్యాంక్ రుణాలు వస్తాయి. కానీ ఎవరిని మోసం చేద్దామనుకుంటారో కానీ పిల్లి కళ్లుమూసు కునిపాలు తాగిన చందాన నిబంధనలు ధిక్క రిస్తారు. అది సమస్యగా మారుతోంది. భవనాల నిర్మాణాల పరిధిని బట్టి, ఆయా ప్రాంతాల్లోని భూమి మార్కెట్ విలువ బట్టి చదరపు మీటరుకు నిర్ణయించిన ప్రకారం ఇవాళ అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంది. వచ్చే పుష్కరాల నేపథ్యంలో సిటీలో అనేక అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. గతంలో మాదిరిగా చూసీచూడనట్టు వదిలేసే పరిస్థితి లేదు. నిబంధనలు ధిక్కరించి నిర్మాణాలు చేసుకున్నవారంతా బీపీఎస్‌ను ఉపయోగించుకుంటే నిర్మాణాలు భద్రంగా ఉంటాయి.

అపరాల సాగుతో నేల ఆరోగ్యం

అపరాల సాగుపై శిక్షణలో వ్యవసాయాధికారి మాధవరావు

కొవ్వూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అపరాల సాగుతో నేల ఆరోగ్యంతో పాటు రైతు ఆదాయం పెంచుకోవచ్చునని జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు అన్నారు. కొవ్వూరు లిటరరీ క్లబ్ క్లబ్ కల్యాణ మండపంలో శనివారం నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ అండ్ న్యూట్రిషన్ మిషన్ (ఎన్ఎఫ్ఎస్ఎన్ఎం) ఆధ్వర్యంలో రైతులకు అపరాల సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు మాట్లాడుతూ అపరాల వుదు, బుడెపల వల్ల నత్రజని మొక్కలకు అందుతుందని, దీంతో నేల ఆరోగ్యం, అపరాలు ఉత్పత్తి, రైతుకు ఆదాయం కూడా మెరుగుపడు తుందన్నారు. ప్రతి మండలంలో ఎన్ఎఫ్ఎస్ఎం క్లస్టర్లు ఏర్పాటుచేసి మినుములు, పెసలు, అపరాల విత్తనాల దగ్గర నుంచి పురుగు, తెగుళ్ల మందుల వరకు సబ్సిడీపై రైతులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. డివిజనల్ సహాయ సంచాలకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ మినుముల రకాలు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. పీయూ 31, వీబీఎన్ 8, టీబీజీ 104, ఎల్‌బీజీ 884 రకాలు, వాటికి వచ్చే తెగుళ్లు, నివారణ పద్ధతులను వివరించారు. అరటి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త రవీంద్రకుమార్ మాట్లాడుతూ నత్తల నివారణ, అరటి, బొప్పాయి, ఉద్యాన పంటల సాగు, సస్య రక్షణ చర్యలు, తెగుళ్లు,పురుగుల మందుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో డిహెచ్‌వో ఎన్.మాణిక్యాలరావు, డీఏహెచ్‌వో డా.టి.శ్రీనివాసరావు, డా.డి.రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపల్ సైంటిస్ట్ మానుకొండ శ్రీనివాస్, ఫిషరీస్ జేడీ ఎన్.నిర్మలాకుమారి, డా.టి.పద్మలత, ఎస్‌కె దిల్షద్, కొవ్వూరు, తాళ్లపూడి, నల్లజర్ల, చాగల్లు, దేవరపల్లి, గోపాలపురం మండలాల వ్యవసాయాధికారులు, ఉద్యాన శాఖాధికారులు, రైతులు పాల్గొన్నారు.

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవాలి

● 9వ అదనపు జిల్లా జడ్జి అనురాధ



ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న జడ్జి అనురాధ

కొవ్వూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్‌లో అన్నిరకాల రాజీపడదగ్గ కేసులను రాజీ చేసుకోవచ్చునని కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.అనురాధ తెలిపారు. డిసెంబరు 13వ తేదీన జరగనున్న జాతీయ లోక్‌అధాలత్‌ను పురస్కరించుకుని శనివారం న్యాయవాదులు, ఇన్సూరెన్సూ కంపెనీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. అదనపు జిల్లా జడ్జి అనురాధ మాట్లాడుతూ ఈ లోక్ అదాలత్‌లో సివిల్, మోటారు వాహన ప్రమాదాల కేసులు, చెక్‌బౌన్స్ కేసులు ఈ.పీలు రాజీమార్గంలో పరిష్కరించుకోవచ్చునన్నారు. దీనివలన సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. ఎక్కువ కేసులు రాజీచేసి కోర్టులకు సహకరించాలని ఇన్సూరెన్సూ కంపెనీ ప్రతినిదులు, న్యాయవాదులకు సూచించారు. అలాగే రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.నాగలక్ష్మి శనివారం మెజిస్ట్రేట్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్‌ను పురస్కరించుకుని పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఏప పోలీస్టేషన్‌లలో ఎన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయి, ఎన్ని కేసులు రాజీకి గుర్తించారు. ఎన్ని రాజీ అవుతాయని వివరాలను సేకరించారు. సమావేశంలో పట్టణ సీఐ పి.విశ్వం, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తాడిపర్రులో ఉచిత వైద్యశిబిరం



వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్న డాక్టర్లు

ఉండ్రాజవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడిపర్రులో కోకో పంటలు పండిస్తున్న గ్రామాల్లో మోండలీజ్ కంపెనీ ఆర్థిక సహకారంతో కోకోలైఫ్ సామాజిక అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఆఫ్రో (ఏక్షన్ ఫర్ ఫుడ్ ప్రొడక్షన్) సంస్థ, ఏలూరుకు చెందిన గడ్ సమరిటన్ క్యాన్సర్ ఆసుపత్రి వారి సౌజన్యంతో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. తాడిపర్రు, ఉండ్రాజవరం, వెలగదుర్రు, మోర్త, పాలంగి, దమ్మెన్ను, పెరవలి మండలం తీపర్రు నుంచి సుమారు 80 మందికి బీపీ, సుగర్, థైరాయిడ్, గుండెజబ్బులు, చర్మ వ్యాధులు, స్త్రీలకు సంబంధించిన వ్యాధులు, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆఫ్రో ప్రాజెక్టు మేనేజర్ పి. విజయకుమార్, గ్రామసర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు,ఆఫ్రో సంస్థ ఏరియా ఫీల్డ్ ట్రైనర్లు జి. డాని, కె. గంగారత్నం, బి. రవితేజ, ఎం.భూకయ్య, ఆసుపత్రి వైద్యులు మౌనిక, సిబ్బంది వినీల్, ఏ. సూరిబాబు, ఎన్. సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

● ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు



చివటంలో రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న శేషారావు

ఉండ్రాజవరం, డిసెంబరు, 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పేర్కొన్నారు. శనివారం మండలంలోని చివటంలో నిర్మిస్తున్న ఆర్‌అండ్‌బీ రోడ్డు పనులను శేషారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి నిధులు కొరత ఉన్నప్పటికీ ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం చేస్తున్న ప్రజాసంక్షేమం, అభివృద్ధిపనులు అమలులో ప్రజాతోడ్పాటు ఉండాలని శేషారావు కోరారు. రోడ్డు నిర్మాణపనులను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు.

కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, ఏఎంసీ చైర్మ న్ గాలింకి జిన్నాబాబు, ఏఈ ఎన్. ఏడుకొండలు, చివటం, కె. సావరం కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు, పరుపులు అందజేత

దేవరపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం తీసుకుని రక్తహీనత బారినపడకుండా కాపాడుకోవాలని యాదవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి హరిచందన అన్నారు. శనివారం యర్నగూడెం ప్రభుత్వ బాలికల వసతిగృహంలో ఆమేన్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో 40మంది బాలికలకు దుప్పట్లు, పరుపులు అందజేసినట్టు ట్రస్టు చైర్మన్ ఇవాంజలి తెలిపారు.

మహానుభావుడు బీఆర్ అంబేడ్కర్

● ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ● ఘనంగా వాడవాడలా 69వ వర్ధంతి



కొవ్వూరులో అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే , చైర్‌పర్సన్



నిడదవోలులో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న చైర్మన్

కొవ్వూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నిమ్న జాతి ప్రజల జీవితాల్లో వెలుగును నింపిన మహానుభావుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కొనియాడారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ 69వ వర్ధంతిని శనివారం కొవ్వూరులోని టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 4వ వార్డులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేడ్కర్ నేతృత్వంలోని బృందం ప్రపంచ దేశాల్లోని రాజ్యాంగాలను పరిశీలించి, దేశంలోని పరిస్థితులు, కుల, మతాలు, రాష్ట్రాల్లోని ప్రజల జీవన విధానాలను అధ్యయనం చేసి అద్భుతమైన రాజ్యాంగాన్ని రూపొందించి మనకు అందించారన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, పట్టణ, మండల అధ్యక్షులు అర్జిల్లి రామకృష్ణ, బేతిన నారాయణ, మద్దుల సత్యనారాయణ, నాళం శ్రీనివాస్, మద్దూకూరి సురేష్, బర్ల శ్రీనివాస్, వేమగిరి వెంకట్రావు, కౌన్సిలర్ బొండాడ సత్యనారాయణ, కొప్పాక జవహర్, కొక్కిరిపాటి వెంకటేష్, బొబ్బిలి పేరాజు, బొంతా శ్యాం రవిప్రకాష్, మాదిరెడ్డి సతీష్, యార్లగడ్డ వీరభద్రం, బొంతా కిషోర్, వరిగేటి కాంతరాజు, పెనుమాక జయరాజు, కొక్కిరిపాటి శ్రీహరి, బహద్దూర్, తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మనకు రాజ్యాంగం అందించిన మహానుభావుడని, ఆయన్ని స్మరించుకోవడం అందరి బాధ్యత అని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. శనివారం నిడదవోలు పట్టణంలోని సంత మార్కెట్ వద్ద అంబేడ్కర్ 69వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జనసేన నాయకులు డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, రంగా రమేష్, మద్దిపాటి ఫణీంద్ర, బచ్చు లక్ష్మణరావు, కౌన్సిపల్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలంలోని పలు గ్రామాల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 69వ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. గజ్జరంలో సర్పంచ్ గండి రాంబాబు ఆధ్వర్యంలో కార్యదర్శి శ్రీనివాస్ అధ్యక్షతన సచివాలయంలో భారత రత్న అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వీఆర్‌వో ప్రవీణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పైడిమెట్టలోని మండల పరిషత్ ప్రాథమిక బేసిక్ పాఠశాలలో భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు డీ.దుర్గారావు, ఉపాధ్యాయులు ధర్మాన రాము, విద్యార్థులు పాల్గొన్నారు.

గోపాలపురం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 69వ వర్ధంతిని మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం ఘనంగా జరుపుకున్నారు. వాదాలకుంట, వెదుళ్లకుంట, జగన్నాథపురం, గోపాలపురం, చిట్యాల, వెంకటాయపాలెం, దొండపూడి, కరగపాడు, జగన్నాథపురం, కొవ్వూరుపాడులో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే మండల పరిషత్, తహశీల్దార్ కార్యాలయంతో పాటు ఆయా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోనూ నిర్వహించారు. అందులో భాగంగా వాదాలకుంటలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సేవా సంఘం సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

దేవరపల్లి: అంబేడ్కర్‌ను యువకులు ఆదర్శంగా తీసుకోవాలని గౌరీపట్నం అంబేడ్కర్ యువజ్యోతి నాయకుడు సోమరాజు వెంకేశ్వరరావు పేర్కొన్నారు. యర్నగూడెం, గౌరీపట్నం, చిన్నాయిగూడెం, తదితర గ్రామాల్లో అంబేడ్కర్ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుమార్, వెంకటేష్, కుండా వెంకటేశ్వరరావు, టేకుమూడి సోమరాజు, టేకుమూడి భీమరాజు, విజయ్ పాల్గొన్నారు.

నల్లజర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని నల్లజర్లలో శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ నిర్వాహకురాలు రమణ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో గుదె సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.



నల్లజర్లలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం



గౌరీపట్నంలో నివాళులర్పిస్తున్న అంబేడ్కర్ యువజ్యోతి సభ్యులు

కొవ్వూరు నుంచి ప్రత్యేక యాత్రా స్పెషల్ సర్వీసులు



మన్యసీమ దర్శిని బస్సులు ప్రారంభిస్తున్న డిపో మేనేజర్ ఎస్వీ నాయక్

కొవ్వూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక యాత్రా స్పెషల్ సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ఎస్వీ నాయక్ తెలిపారు. శనివారం కొవ్వూరు డిపో నుంచి రెండు మన్య సీమదర్శిని ప్రత్యేక బస్సులను ప్రారంభించారు. డిపో మేనేజర్ ఎస్వీ నాయక్ మాట్లాడుతూ ప్రయాణికులు కోరిక మేరకు శనివారం రెండు మన్య సీమదర్శిని ప్రత్యేక బస్సులను పంపించడం జరిగిందన్నారు. ఆదివారం భవరిమలకు ప్రత్యేక యాత్రా బస్సును పంపిస్తున్నామన్నారు. బస్సుకు సరిపడా ప్రయాణికులు ఉన్నచో స్పెషల్ సర్వీసును ఏర్పాటుచేయడం జరుగుతుందన్నారు. పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్నిసద్వినియోగం చేసుకుని ఆర్టీసీని ఆదరించాలన్నారు.

ఏసుక్రీస్తు బోధనలు ఆచరించాలి



వాత్సల్య వృద్ధాశ్రమంలో క్రిస్మస్ వేడుకలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏసుక్రీస్తు బోధనలు ప్రతిఒక్కరూ ఆచరించాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు పట్టణంలో రీనా చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాత్సల్య వృద్ధాశ్రమంలో శనివారం అందాల క్రిస్మస్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, పట్టణ, మండల అధ్యక్షుడు అర్జిల్లి రామకృష్ణ, బేతిన నారాయణ, నాళం శ్రీనివాస్, మద్దూకూరి సురేష్, బర్ల శ్రీనివాస్, వేమగిరి వెంకట్రావు, కొప్పాక జవహర్, కొక్కిరిపాటి వెంకటేష్, బొబ్బిలి పేరాజు, మాదిరెడ్డి సతీష్, వరిగేటి కాంతరాజు, పెనుమాక జయరాజు, కొక్కిరిపాటి శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ బాలికల జూనియర్ కలాశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో ఏబీవీపీ ప్రతినిదులు సతీష్, రవీంద్ర, వై.ఐశ్వర్యాంబిక, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

చాగల్లు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం చాగల్లు సెంటర్‌లోని శ్రీభక్త ఆంజనేయస్వామి వారి జయంతి మహోత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. శనివారం స్వామివారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సహస్ర సింధూర్చన నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు దొడ్డా వీర వెంకట ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఐశ్వర్యలక్ష్మీ హోమం



ఆలయంలోకి ప్రతిమలను తీసుకుని వస్తున్న మహిళలు

తాళ్లపూడి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రక్కిలంక శ్రీభక్తాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సంలో భాగంగా శనివారం ఐశ్వర్యలక్ష్మీ హోమాధి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పెద్దింటి శ్యామ్, భార్గవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐశ్వర్యలక్ష్మీ హోమంలో భాగంగా అభిషేకాలు, ప్రత్యేక పూజల అనంతరం అష్టలక్ష్మీ ప్రతిమలను సుందరంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఆంజనేయ దీక్షలు చేపట్టిన సొలస గిరిధర్ గాంధీ, సొలస విశ్వనాథం, అల్లూరి విక్రమాదిత్య, డా. ఆర్. రవికుమారెడ్డి, డాక్టర్ దత్తాత్రేయులు, శీమకుర్తి సత్యనారాయణ మూర్తి, గౌతమ్, సుధీర్ కుమార్ దంపతులు, తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో బీజేపీ బలపడదు

●మాజీ ఎంపీ ఉండవల్లి అరుణకుమార్

రాజమహేంద్రవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీది బయోలాజికల్ పుట్టుక కాదు. తాను దేవుడనని మోదీనే స్వయంగా చెప్పుకుంటున్నారు. రాష్ట్రంలోని రెండు పార్టీలు మోదీకి అనుకూలంగా మారిపోయాయని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణకుమార్ ఎద్దేవా చేశారు. రాజమహేంద్రవరంలో ని ధర్మంచర హాల్‌లో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. డిసెంబరు 6న రాజ్యాంగ నిర్మాత అంబే ద్కర్ వర్ధంతి కానీ బాబ్రీ మసీదును కూల్చి రాజ్యాంగాన్ని తుంగలో తొక్కిన రోజు కూడా ఇదే. ఏ ప్రభుత్వాని కైనా అపరిమిత హక్కులు కల్పించి ప్రజలు మౌనంగా ఉంటే ఆదేశం పతనమవుతుందని ఆనాడే అంబేడ్కర్ చెప్పారని గుర్తు చేశారు. ఇండియా-పాకిస్థాన్ మధ్య తాను రాజీ చేశానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెబుతుంటే మోదీ కనీసం స్పందించకపోవడం ఏంటని ఆయన ప్రశ్నించారు. హిందుత్వం మతం కాదు. అదో సంస్కృతి. సనాతన ధర్మం. అది ఎప్పటికీ పోదు. మనది సెక్యులర్ దేశమని చెప్పారు. పాకిస్థాన్ గురించి భయపడాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు. రాజకీయపరమైన యుద్ధాలను మతపరంగా మార్చి, ప్రజల మధ్య గొడవలు పెడుతున్నారన్నారు. నెహ్రూను దుర్మార్గుడిగా చిత్రీకరిస్తున్న మోదీకి చరిత్ర తెలియదన్నారు. కాంగ్రెస్ ఉనికి లేకుండా చేయడమే బీజేపీ లక్ష్యంగా మాట్లాడుతోందని తెలిపారు. ఆంధ్రలో ఎప్పటికీ బీజేపీ బలపడలేదని స్పష్టం చేశారు.

వరల్డ్ రికార్డ్సులో గుర్తింపు

తాళ్లపూడి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తాళ్లపూడిలోని సెయింట్ యూజిన్ పాఠశాల విద్యార్థులు శనివారం కనపరిచిన ప్రతిభతో పాఠశాలకు అయిన్‌స్టీన్ వరల్డ్ రికార్డ్సుకు నమోదు అయినట్టు పాఠశాల కరస్పాండెంట్ జాన్ బ్రిట్టో తెలిపారు. ఇన్నోవేషన్ మారథాన్‌లో పాల్గొని పాఠశాలలోని 300 మంది విద్యార్థులు 100 నిమిషాలలో 300 ఆవిష్కరణలు చేసి కొత్త వరల్డ్ రికార్డును సాధించారని బ్రిట్టో తెలిపారు.

రేపు కాకినాడలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వికాస ఆధ్వర్యంలో ఈనెల 8న కాకినాడలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఈ మేళాలో పలు కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఈ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, బీటెక్ ఉత్తీర్ణులైన 40 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి గల వారు సోమవారం ఉదయం 9గంటలకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్దకు హాజరు కావాలన్నారు. వివరాలకు 77993 76222 నెంబరును సంప్రదించాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

● నిడదవోలు ప్రజాదర్బార్‌లో మంత్రి దుర్గేష్



ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న మంత్రి

నిడదవోలు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శనివారం సాయంత్రం నిడదవోలు పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాల యంలో నిడద వోలు నియోజకవర్గ ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిడదవోలు నియోజకవ ర్గంలోని నిడదవోలు పెరవలి, ఉండ్రాజవరం, మండలాలకు చెందిన పలువురు వచ్చి వినతులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిడదవోలు నియోజకవర్గం సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు, నియోజకవర్గ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీతోనే బీసీల అభివృద్ధి సాధ్యం'



మునేశ్వరరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు వేముల నాగరాజు

గోపాలపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బీసీల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు వేముల నాగరాజు అన్నారు. దేవరపల్లి మండల టీడీపీ మండల నూతన అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన తంగెళ్ల మునేశ్వరరావును గణపవరం బీసీ సంఘం నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు వేముల నాగరాజు మాట్లాడుతూ టీడీపీకి బీసీలు వెనుముకగా నిలవాలన్నారు. సామాజిక పరంగా, రాజకీయపరంగా బీసీలను గౌరవించిన పార్టీ టీడీపీ అన్నారు. టీడీపీలోనే బీసీలకు గుర్తింపు, గౌరవం లభిస్తాయన్నారు. బీసీలంతా ఏకతాటిపై టీడీపీకి అండగా నిలబడాలన్నారు. కార్యక్రమంలో గోపాలపురం మండల బీసీ సెల్ అధ్యక్షుడు బిక్కవోలు నాగేశ్వరరావు, గోపాలపురం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ పడమటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అమ్మవారికి చీర, సారె సమర్పణ



అమ్మవారికి సారె సమర్పించడానికి వచ్చిన ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

నిడదవోలు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తిమ్మరాజుపాలెంలో వేంచేసి ఉన్న కోటసత్తెమ్మ వారి దేవస్థానంలో అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలు శనివారంతో మూడోరోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా విశేష కుంకుమ పూజలతో పాటు ఉదయం చండీపారాయణం, సాయంత్రం చండీహోమాన్ని ఘనంగా నిర్వహించారు. తిరునాళ్ల మహోత్సవాలు సందర్భంగా స్థానిక ఆర్యవైశ్యసంఘం అమ్మవారికి చీర, సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సెయింట్‌పాల్ లూథరన్ చర్చిలో గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు

● ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



చర్చిలో క్యాండిల్స్ వెలిగిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): క్రీస్తు బోధనలు అనుసరణీయమని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు పట్టణంలోని సెయింట్‌పాల్ లూథరన్ చర్చిలో కొవ్వూరు నియోజకవర్గ నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో శనివారం గ్రాండ్ క్రిస్మస్ సెలబ్రేషన్స్ నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని క్యాండిల్స్ వెలిగించి, ప్రార్థనలు నిర్వహించి, క్రిస్మస్ కేక్ కట్‌చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా నెలరోజులు పాటు జన్మదిన వేడుకలు నిర్వమించేది ఒక్క ఏసుక్రీస్తుకు మాత్రమేనన్నారు. సమాజంలో క్రైస్తవ సంస్థలు సమాజ సేవా కార్యక్రమాలు ఎక్కువగా నిర్వహిస్తారన్నారు. మిషనరీ పాఠశాలలు, ఆసుపత్రులు నెలకొల్పి పేద ప్రజలకు సేవలు చేయడం అభినందనీయమన్నారు. దేశాన్ని, రాష్ట్రాన్ని పాలిస్తున్న ప్రదాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేష్ నాయకత్వంలో రాష్ట్రంలో కూటమి సుపరిపాలన కొనసాగాలని దైవజనులు ప్రార్థించాలన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, పట్టణ అధ్యక్షుడు అర్జిల్లి రామకృష్ణ, పాస్టర్ సాక్షిబాబు, సంఘకాపరులు, దైవజనులు పాల్గొన్నారు.

రేపు ఎస్‌వీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

● జిల్లా ఉపాధి అధికారి హరీష్ చంద్ర ప్రసాద్

నిడదవోలు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఉపాధి, నైపుణ్యాభివృద్ధి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10 గంటలకు నిడదవోలు ఎస్‌వీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె. హరీష్‌చంద్ర ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిడదవోలులో కళా శాల ప్రిన్సిపాల్ డా. కె.జ్యోతి మాట్లాడుతూ సోమవారం నిర్వహిస్తున్న జాబ్‌మేళాలో అర్హత ఉన్న నిరుద్యోగ యువత హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కిసాన్ మార్ట్, క్రెడ్ ఆక్సిస్ గ్రామీణ, ఆపాక్ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఎస్‌బిఐ కర్డ్, ఆర్‌బీఎల్ కర్డ్, తదితర సంస్థలు పాల్గొంటు న్నాయని, ఇవి పలు ఖాళీల భర్తీకి నేరుగా ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 12 తరగతి, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బి.టెక్ చదివినవారు లేదా అనుభవం ఉన్న వారు, 19 నుంచి 30 సంవత్సరాల వయస్సు కలిగిన నిరుద్యోగులు పాల్గొనవచ్చని తెలిపారు. ఎంపికైన వారికి తక్షణమే ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తామని చెప్పారు. జాబ్‌మేళాకు హాజరు అయ్యేవారు ముందుగానే నైపుణ్యం పోర్టల్‌లో వారి పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వీడీజీ మురళి సూచించారు. హాజరయ్యే అభ్యర్థులు బయోడేటా, ఆధార్ కార్డు, విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు వెంట తెచ్చుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9533221189 నంబర్‌ను సంప్రదించవచ్చని అధికారులు సూచించారు.

సిద్ధి వినాయకుడి సన్నిధిలో సమాచారశాఖ కమిషనర్

అయినవిల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ (విజయవాడ) చావలి సునీల్‌కుమార్ శనివారం కుటుంబ సమేతంగా అయినవిల్లి శ్రీసిద్ధి వినాయకస్వామిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. తొలుత వీరికి ఆలయ మర్యాదలతో అర్చకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం పండితులు వేదాశీర్వచనం అందజేసి శేషవస్త్రంతో సత్కరించారు. తర్వాత విఘ్నేశ్వరస్వామి చిత్రపటం, ప్రసాదమిచ్చారు.

సామర్లకోట: సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ సునీల్‌కుమార్ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమరావతి నుంచి జిల్లా పర్యటనార్థం విచ్చేశారు. ఆయనకు ఆలయ ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు సోమేశ్వరశర్మ, చెరు కూరి సుందర రామయ్య (రాంబాబు), వెంకన్న, అంజిబాబు, తదితరుల వేదమంత్రోచ్చారణల మధ్య సాదరంగా స్వాగతం పలికారు. ముందుగా కాలభైరవస్వామిని దర్శించి ఆలయ ఆవరణ లోని అన్ని ఉపాలయాల దేవతామూర్తులను దర్శించారు. తర్వాత భీమేశ్వరస్వామికి విశేష అభిషేక పూజలు, బాలాత్రిపుర సుందరి అమ్మ వారికి విశేష పుష్పార్చన పూజలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా కమిషనర్ సునీల్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసినవారిలో కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు, సామర్లకోట తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, డిప్యూటీ తహ శీల్దార్ వై. శ్రీనివాసు, తదితరులు ఉన్నారు.